# ముందుమాట

**- బి.ఎస్. రాములు**
సామాజిక తత్వవేత్త
బీసీ కమిషన్ తొలి ఛైర్మన్

ఈ పుస్తకం ప్రతి ఇంట్లో ఉండాలి. ప్రతి ఒక్కరు చదవాలి. ప్రతి ఒక్కరి చేతిలో కనపడాలి. భారత రాజ్యాంగం ఛత్రఛాయలో భారత ప్రజలు జీవిస్తున్నారు. అందువల్ల పౌరులందరు రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి. తమ హక్కులేమిటో, కర్తవ్యాలేమిటో తెలుసుకోవడం అవసరం. భారత రాజ్యాంగంలో మొత్తం 395 ఆర్టికల్స్ ఉన్నాయి. ఇందులో ప్రతి ఒక్కరికీ అవసరమైనవి సంక్షిప్తంగా పేర్కొన్నాను. ప్రభుత్వాలు ఎలా ఏర్పడుతున్నాయి, ఎలా పని చేస్తున్నాయి, ఓటు హక్కు ద్వారానే ఈ మొత్తం పరిపాలన వ్యవస్థ ఎలా నిర్దేశించబడుతున్నదో రాజ్యాంగం చదివితే తెలుస్తుంది. ప్రజా ప్రతినిధులను రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లోక్‌సభ, శాసనసభ సభ్యులను సర్పంచ్ దాక మొదలైన అందరినీ కని పెంచుతున్న తల్లిదండ్రులు పౌరులే అనే విషయం అర్థం చేసుకోవాలి.

ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు 57 లక్షల మంది విద్యార్థులందరికి భారత రాజ్యాంగం ప్రతిని ఉచితంగా అందజేస్తున్నది. దేశమంతటా ఇది ఆచరించడం అవసరం. అందరికీ రాజ్యాంగమే మూలం. అందువల్ల ఆ రాజ్యాంగానికి మనం కరదీపికగా ఈ సమాజాన్ని సామాజిక సంస్కరణ, ఆధునిక అభివృద్ధిని, అందులో సమానమైన వాటాను సాధించుకోవడం అవసరం. అడగనిది అమ్మైనా పెట్టదు. అంగట్లో ఉన్నంత మాత్రాన అన్ని మన నోట్లోకిరావు. రాజ్యాంగంలో ఉన్నంత మాత్రాన మనకు అందుబాటులోకిరావు. మనం వాటికోసం డిమాండు చేసి, ఉద్యమించి సాధించుకున్నప్పుడే మన అందుబాటులోకి వస్తాయి.

ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలోనే మన వివేచన, దక్షత, సామర్థ్యం దాగి ఉంది. మనం ఎలాంటివారిని ఎన్నుకుంటే అలాంటి పరిపాలనే ఉంటుంది. ఎన్నికల ప్రణాళికలో ఎన్నో చెప్తారు. వాటిని ఆచరించకపోవచ్చు. అందువల్ల

వాటికోసం ఉద్యమించడం అవసరం. అందుకు రాజ్యాంగంలోని హక్కులేమిటో తెలుసుకోవడం అవసరం. ప్రతి ఒక్కరికీ అవసరమైన మేరకు ఈ చిన్న పుస్తకంలో పొందుపరిచాను. బీసీ కమిషన్ ఛైర్మన్‌గా రాసిన "బీసీ నోట్‌బుక్" నుండి ముఖ్యమైన అంశాలను సంక్షిప్తీకరించి పొందుపరచడం జరిగింది.

## 26 జనవరి 1950కి ముందు మనుషులందరూ సమానం కాదు

భారత రాజ్యాంగం విశిష్ఠతను ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు సరిగ్గా గుర్తించడం లేదు. భారత రాజ్యాంగం మనుషులందరిని సమానం చేసింది. "వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్" (ప్రతి మనిషికి ఒకే విలువ. ఒకే ఓటు) అని స్థిరపర్చింది. 26 జనవరి 1950 నుంచి భారత రాజ్యాంగం ద్వారా ఇది తాత్విక భూమికగా నిలిచింది. దాంతో రాజ్యాంగబద్దంగా మనుషులందరు సమానమయ్యారు. అంతకుముందు మనుషులందరు సమానులు కారు. విభిన్న కులాలుగా, వర్ణాలుగా, వర్గాలుగా, తెగలుగా, జాతులుగా అనేక అసమానతలకు, వివక్షతలకు, వెలివేత లకు, పీడనలకు, అణచివేతలకు గురయ్యే తత్వశాస్త్రాలు, పురాణ ఇతిహాసాలు, మనుస్మృతి, బ్రాహ్మణీయ శాస్త్రాలు, రామాయణం, మహాభారతాలు మొదలైనవి వర్ణ, కుల వ్యవస్థల అసమానతలకు పునాదిగా నిలిచాయి. వాటన్నిటిని పూర్వపక్షం చేస్తూ ఆధునిక సమాజ నిర్మాణంకోసం భారత రాజ్యాంగం ప్రపంచంలో ఒక గొప్ప రాజ్యాంగంగా ముందుకు వచ్చిన రోజు 26 జనవరి 1950.

## పరస్పర అంగీకారంతో సాధించిన విజయాలే భారత రాజ్యాంగం

పరస్పరం అంగీకారంతో సాధించిన విజయాలే భారత రాజ్యాంగం. అందులో వాయిస్ గ్రూపుగా ఉన్నవారు, అందులో లేనివారిని కూడా పట్టించుకున్నారు. మహిళలు, బాలలు లేకపోయినప్పటికీ వారి గురించి పట్టించుకున్నారు. ఓబీసీలు బలమైన వాయిస్ ఇవ్వగలిగినవారు ఎవరూ లేకపోయినప్పటికీ అనేక ఆర్టికల్స్‌ను చేర్చి రక్షణను కల్పించారు. తర్వాత తీసుకోవాల్సిన చర్చల కోసం అవకాశమిచ్చారు. చర్యలకోసం, చట్టాలకోసం అవకాశాలిచ్చారు. అందరిని ఒప్పించిన రాజ్యాంగం అన్నింటికన్నా గొప్పది. ఆచరణలో ఉన్నది.

## ప్రపంచంలోని మహోన్నత తాత్వికత "వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్".

"వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్" (ప్రతి మనిషికి ఒకే విలువ. ఒకే ఓటు) అనేది ఎంత గొప్ప తాత్వికతో నేను అనేక తాత్విక గ్రంథాల్లో, రచనల్లో, ప్రసంగాల్లో వివరించాను. దీన్ని బలంగా జీవితమంతా సమస్థరంగాల్లోకి విస్తరింప

జేసిన దార్శనికుడు డా॥ బి.ఆర్. అంబేద్కర్. వేల యేళ్ళుగా ఎందరో తత్వవేత్తలు ఎన్నో సిద్ధాంతాలు చేశారు. వాటన్నిటి కన్నా అత్యంత వాస్తవికమైన అత్యున్నత తాత్వికత. అది రాజ్యాంగబద్ధమైంది. అన్నిటికి భూమికగా నిలిచింది. దీని ప్రాధాన్యతను బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు గుర్తించాలి. ఇతర దేశాల్లో అనేక ఉద్యమాల తర్వాత సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించబడింది. మహిళలకు ఎంతో ఆలస్యంగా ఓటు హక్కు కల్పించారు.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం. సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు. సమస్థ అసమానతలు, వివక్షతలు, దోపిడీల నిర్మూలన. కుల నిర్మూలన, స్త్రీల సమానత్వం, స్టేట్ సోషలిజం, భూమిని, పరిశ్రమలను, బ్యాంకులను, ఇన్సూరెన్స్ కంపెనీలను జాతీయం చేయడం, ప్రభుత్వ ఉద్యోగ, విద్యా రంగాలలో వెనుకబడిన సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు, విద్య ప్రాముఖ్యత, మానవీయ విలువలు, ప్రపంచ స్థాయిలో భారతదేశం పునర్నిర్మాణం. రాజ్యాంగ నిర్మాణ పరంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ రుణం భారతజాతి తీర్చుకో లేనిదని ప్రథమ రాష్ట్రపతి డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ హిందూ సమాజంలోని కుల, మత, ఆర్థిక దోపిడీ శక్తులపాలిట విప్లవానికి ప్రతీక అని భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు.

## భారత స్వాతంత్ర్య చట్టం, 1947

'లార్డ్ మౌంట్ బాటన్ ప్రణాళిక' భారతదేశ విభజనకు ఆధారం అని చెప్పవచ్చు. ఈ ప్రణాళిక ప్రకారం బ్రిటిషు పార్లమెంట్ భారత స్వాతంత్ర చట్టాన్ని 1947 జులై 5, ఆమోదించింది. ఇది 1947 జులై 18న బ్రిటీషు రాజరికం ఆమోదాన్ని పొందింది. ఈ చట్టం 1947 ఆగష్టు 15 నుంచి అమలులోకి వచ్చింది. భారత స్వాతంత్ర్య చట్టాన్ని పురస్కరించుకొని, ఇండియా, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు అవతరించాయి. భారత రాజ్యాంగం సుదీర్ఘమైనది. భారత రాజ్యాంగంలో శాసన నిర్మాణ, పరిపాలన, ఆర్థిక సంబంధాలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఎలా ఉండాలో వివరించారు.

## భారత రాజ్యాంగం రూపకల్పన

డా॥ బి.ఆర్. అంబేద్కర్ డ్రాఫ్ట్ కమిటీ ఛైర్మన్‌గా 1948, జనవరి నెలలో రాజ్యాంగం తొలి ముసాయిదా ప్రతి (చిత్తు ప్రతి) విడుదల అయింది. ఆ చిత్తు ముసాయిదాకు వివిధ వర్గాల నుండి, ప్రజల నుండి 7,635 సవరణలు వచ్చాయి.

వాటిలో 2,473 సవరణలపై ఉప సంఘం చర్చించింది. 26-11-1949న నూతన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. తొలి రాజ్యాంగ ప్రతిపై 24-1-1950 తేదీన 284 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు సంతకాలు చేశారు. అలా నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం. 1950 జనవరి 26 నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అదే గణతంత్ర దినం అనే రిపబ్లిక్‌డే.

## అన్ని రంగాల్లో ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతినిధ్యం ఆవశ్యకత

చట్ట సభలకు ప్రాదేశిక నియోజకవర్గాల ద్వారా ప్రతినిధులున్నారు. పరిపాలనా యంత్రాంగంలో కూడా ఐఏఎస్ మొదలుకొని నాన్ గెజెటెడ్ అధికారి దాకా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ప్రాదేశిక నియోజకవర్గాల ప్రకారం ఉద్యోగులు, అధికారులు ఎన్నికయ్యే వ్యవస్థను అమలు జరుపుకోవాలి. న్యాయ వ్యవస్థలో కూడా ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా 'ఇండియన్ జుడిషయల్ సర్వీస్' వంటి పరీక్షల ద్వారా హైకోర్టు, సుప్రీంకోర్టు, న్యాయమూర్తుల ఎంపిక జరగాలి. అలాగే ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా పారిశ్రామికీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి. పరిపాలనా అధికారం యంత్రాంగంతో నియామకాలు, న్యాయవ్యవస్థలో నియామకాలు, ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా జరగడం అవసరం. నీట్ పరీక్షవలె అఖిలభారత స్థాయిలో పరీక్షలు నిర్వహించి, స్థానికత ఆధారంగా నియామకాలు, ఎంపిక చేయడం అవసరం. అప్పుడే పూర్తిస్థాయిలో అన్ని ప్రాంతాలకు, అన్ని సామాజిక వర్గాలకు ప్రజాస్వామ్యంలో ప్రాతినిధ్యం లభిస్తుంది. అప్పటిదాకా రాజకీయ రంగంలో సమాన అవకాశాలు మాత్రమే ఉండి మూడింట ఒకటవవంతు ప్రజాస్వామ్యం కొనసాగుతుంది. మిగతా పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ అనే రెండు మూలస్థంబాల్లో అన్యాయం, అసమానతలు కొనసాగుతూనే ఉంటాయి.

## ఆయాచితంగా వస్తే విలువ తెలియదు

మనం భారతరాజ్యాంగంలో ఉద్యమాలు చేసినా, చేయకపోయినా, కోరినా, కోరకపోయినా, అందరికీ సమాన హక్కులను కల్పించడం జరిగింది. బహుశా అందువల్లనేమో ఓటు హక్కుయొక్క విలువ, భారత రాజ్యాంగం యొక్క విలువ, ప్రాథమిక హక్కుల యొక్క విలువ తెలియక రకరకాల ప్రలోభాలకు, ప్రభావాలకు లోనై మెజారిటీ ప్రజలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోకుండా తమను అణచివేసే, దోపిడీ చేసే ఆధిపత్య వర్గాలవారిని, కులాలవారిని, అసమాన తల సంస్కృతిని, సనాతన ధర్మం పేరిట అణచివేతలను, దోపిడీని, అసమానతలను

పెంచి పోషించే సంస్కృతిని ముందుకు తెస్తున్న వారిని ఎన్నుకుంటున్నారు.

## సాధించిన హక్కులను పొందాలన్నా ఉద్యమాలు అవసరం

రాజ్యాంగంలో పొందుపర్చుకోవడం ఒక ఎత్తు. వాటిని ఆచరణలోకి తెచ్చుకోవడం మరో ఎత్తు. అందుకు ప్రజలు, సామాజిక వర్గాలు ఉద్యమాలు చేయాల్సి ఉంటుంది. వ్యతిరేక శక్తులతో సంఘర్షించాల్సి ఉంటుంది. ఏ సంఘర్షణ లేకుండా, ఏ మార్పు జరగదు. సంఘర్షణ సైద్ధాంతికంగా చేయాలి. సంఖ్యాబలంతో ఉదాత్తమైన నినాదాలు ఇవ్వాలి. తాత్విక పునాది ఏర్పర్చాలి. భారత రాజ్యాంగం 17వ ఆర్టికల్ ద్వారా అంటరానితనం నిషేధించబడింది. అయినా నేటికీ ఆచరిస్తూనే ఉన్నారు. దీనికి వ్యతిరేకంగా ఆయా సామాజిక వర్గాలతో, అమానవీయ సంస్కృతితో దానికి మద్దతు ఇస్తున్న మనుస్మృతికి వ్యతిరేకంగా, వర్ణ కుల, ఆధిపత్యవాదులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సి ఉంటుంది.

అలాగే బాల కార్మిక వ్యవస్థ నిషేధించబడింది. స్త్రీల వివక్ష నిషేధించ బడింది. కుల వివక్ష నిషేధించబడింది. అయినప్పటికీ సమాజంలో కొనసాగుతున్నాయి. అంటరానితనం పాటించడం నేరం అని 1950లో రాజ్యాంగంలో చేర్చుకున్నప్పటికీ, అది ఆచరణలోకి రావడానికి అనేక ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. అలా అనేక ఉద్యమాల అనంతరం1989లో అంటరానితనం నేరమని, అందుకు శిక్షలు ఉంటాయని, అత్యాచార నిరోధక చట్టంతో నాన్ బెయిలబుల్ శిక్షార్హమైన నేరంగా ఉనికిలోకి వచ్చింది. ఇలా రాజ్యాంగంలో ఒక అంగీకారానికి వచ్చి ఆర్టికల్స్‌లో చేర్చిన తర్వాత వాటిని ఆచరణలోకి తెచ్చుకోవాడానికి ప్రతి అంశంపై ఉద్యమాలు చేయాల్సి ఉంటుంది.

మారాల్సింది నువ్వయినపుడు అవతలి వారిని మారాలని మార్చాలని ప్రయత్నిస్తే ఫలమేమి? మారాల్సింది అవతలివారైనుపుడు నిన్ను నీవు ఎన్నిసార్లు తిట్టుకున్నా, మార్చుకున్నా ఉపయోగమేమి? మారాల్సింది సమాజమైనపుడు నిన్ను నీవు ఎంత మార్చుకున్నా ఒరిగేది ఏమిటి? జరిగేది ఏమిటి? మారాల్సింది ప్రభుత్వ విధానాలు, రాజకీయాలు అయినపుడు మనం మనం నువ్వంటే నువ్వు అని తన్నుకోవడం, తిట్టుకోవడంతో వచ్చేదేమిటి? సమాజంలో వచ్చే మార్పేమిటి? నువ్వు సమాజం కోసం పని చేయకుండా సమాజం మారాలని కోరితే నీవల్ల సమాజానికి ఒరిగేదేమిటి? నువ్వు మారాలి. అవతలి వారిని మార్చాలి. నలుగురు కలిసి సమాజాన్ని మార్చాలి. సంఘటిత శక్తిగా ఎదగాలి. సంఘ సంస్కరణ జరగాలి.

వ్యక్తిగతంగా కాకుండా సమాజం గురించి ఆలోచించాలి. అసమానతలు వివక్షలు ఆధిపత్యాలు తొలగించే కృషి చేయాలి.

కదిలిస్తే సమాజం కదులుతుంది. కరిగిస్తే హృదయం కరిగిపోతుంది. అతికిస్తే పగిలిన ఎముకలు అతుక్కుంటాయి. కరిగిస్తే చెదిరిన విరిగిన హృదయాలు మునుపటి కన్నా బలంగా పెనవేసుకుంటాయి.ఒప్పిస్తే బలమైన శత్రువులైనా మిత్రులవుతారు.అంగుళి మాలుడిలా... సౌలు పౌలుగా మారినట్టుగా! బుద్ధుడు కదిలించాడు. సమాజం కదిలింది. భక్త కబీర్, రవిదాస్ కదిలించారు. సమాజం కదలబారింది. జ్యోతిరావు పూలే సమాజాన్ని కదిలించాడు సమాజం కదిలింది. సావిత్రి బాయి పూలే కదిలింది సమాజం కదలబారింది. అంబేద్కర్ సమాజాన్ని కదిలించాడు. సమాజం తోపాటు రాజ్యమే కదిలింది. అంబేద్కర్ రాజ్యాంగమై నిలిచాడు.

ఇప్పటికైనా ఓబీసీలయకు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఉద్యమించి సాధించుకోవాలి. రాజకీయ రంగంలో ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతినిథ్యం కొనసాగుతున్నది. ఈ తాత్వికత అన్ని రంగాల్లోకి విస్తరించాలి. ఉద్యోగ రంగంలో, న్యాయ వ్యవస్థలో, సైనిక వ్యవస్థలో, పారిశ్రామిక వ్యవస్థలో, ఆర్థిక రంగంలో అన్ని రంగాల్లో ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా ఐఏఎస్ మొదలుకొని కింది దాకా, సుప్రీంకోర్టు జడ్జి మొదలుకొని కిందిస్థాయి జడ్జి దాకా, సర్వ సైన్యాధ్యక్షుడు మొదలుకొని కిందిస్థాయి సైనికుడు దాకా ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతినిథ్యం ప్రవేశపెట్టి అమలు జరిపినప్పుడే రాజకీయ ప్రజాస్వామ్యం, సామాజిక రంగంలో, ఆర్థిక రంగంలో, సాంస్కృతిక రంగంలో అమలులోకి తెచ్చినట్టు అవుతుంది. ప్రతి లోక్‌సభ నియోజక వర్గానికి యేటా నియమించబడుతున్న వెయ్యిమంది ఐఏఎస్ రిక్రూట్‌మెంట్‌లో ప్రతి నియోజక వర్గానికి ఇద్దరు ఐఏఎస్‌లు ఎంపిక అవుతారు. ఐదేళ్ళలో ప్రతి లోక్‌సభ నియోజక వర్గం నుండి పదిమంది ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు, ఐఆర్ఎస్‌లు ఎన్నికవుతారు. అలాగే అన్ని రంగాలలో నియోజకవర్గాలవారీగా ఎన్నికవుతారు. తద్వారా దేశంలోని ప్రతి నియోజకవర్గం సమానంగా అభివృద్ధి చెందుతుంది. సమానంగా ఉద్యోగాలను పొందుతుంది. వీటిల్లో సామాజిక వర్గాల, జనాభా రిజర్వేషన్లు ప్రాతినిథ్యం కూడా అమలు జరపాలి. అప్పుడే రాజకీయ రంగంలో తెచ్చుకున్న ప్రజాస్వామ్యం మిగతా అన్ని రంగాల్లోకి సాధికారికంగా అమలు జరిపినట్టు అవుతుంది.

# భారత రాజ్యాంగం
# ప్రవేశిక (ప్రియాంబుల్)

డా॥ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ డ్రాఫ్ట్ కమిటీ అధ్యక్షుడిగా సమిష్టి కృషితో రూపొందిన భారత రాజ్యాంగం ప్రవేశిక లేదా పీఠికతో మొదలవుతుంది. జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టిన ఆశయాల తీర్మానం (Objectives Resolution)లోని అనేక అంశాలు ఇందులో కానవస్తాయి. రాజ్యాంగం యొక్క తాత్విక పునాదులు ఈ ప్రవేశికలో ఉన్నాయని చెప్పవచ్చును. **42**వ రాజ్యాంగ సవరణ చట్టం, **1976** తర్వాత రాజ్యాంగ ప్రవేశిక ఈ కింది విధంగా ఉంది.

## "భారత ప్రజలమైన మేము

భారతదేశాన్ని 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర వ్యవస్థ' (సోషలిస్ట్, సెక్యులర్, డెమొక్రటిక్, రిపబ్లిక్) గా రూపొందించు కోవటానికి చిత్తశుద్ధితో తీర్మానించుకున్నాము.

ప్రజలందరికీ, ప్రజాస్వామ్య గణతంత్ర ఫలాలు అందదానికి

**న్యాయం (జస్టిస్): సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ;**

**స్వేచ్ఛ (లిబర్టి): ఆలోచనలో, భావ ప్రకటనలో, విశ్వాసంలో, ఆరాధనలో;**

**సమానత్వం (ఈక్వాలిటి): సమాన గౌరవం, అందరికి సమాన అవకాశాలు;**

**సౌభ్రాతృత్వం (ఫ్రాటర్నిటి): వ్యక్తి గౌరవాన్ని, జాతి ఐక్యతను, సమగ్రతను పెంపొందించే;**

మా రాజ్యాంగ సభలో **26** నవంబర్, **1949** నాడు ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి, రాజ్యాంగంగా రూపొందించుకొని మాకు మేము సమర్పించు కుంటునాము".

# భారత రాజ్యాంగం పార్ట్ - 1

## ఆర్టికల్ 1

**దేశం పేరు, సరిహద్దులు:** మొదటి షెడ్యూల్లో ఉదహరించిన రాష్ట్రాలు, యూనియన్ పాలిత ప్రాంతాలు, ఆ తరువాత చేర్చే ఇతర ప్రాంతాలు.

9వ రాజ్యాంగ సవరణ ద్వారా 1వ షెడ్యూల్ సవరించబడింది. 10వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 240, 1వ షెడ్యూల్ సవరించబడింది. ప్రస్తుతం...

(భారత రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్ దేశ సరిహద్దులను తెలుపుతుంది. గోవా, సిక్కిం వంటి రాష్ట్రాలను రాజ్యాంగం రాసిన తర్వాత ఇండియాలో కలపడం జరిగింది. అందుకు రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ ఒకటిలో సరిహద్దులను మార్చడం జరిగింది.)

## ఆర్టికల్ 1:

దేశం పేరు, భూభాగం (Name and territory of the Union)

1) ఇండియా అనబడే భారత్, రాష్ట్రాల కలయికతో ఏర్పడింది. shall be union of States
2) రాష్ట్రాలు, వాటికి చెందిన భూభాగాలు మొదటి షెడ్యూలులో ఉదహరింప బడినవి.
3) ఈ క్రింది భూభాగమంతా కలసి భారత దేశ భూభాగం అవుతుంది.
   - ఎ) వివిధ రాష్ట్రాలకు చెందిన భూభాగాలు.
   - బి) మొదటి షెడ్యూలులో ఉదహరింపబడిన కేంద్రపాలిత ప్రాంతాల భూ భాగాలు.
   - సి) భవిష్యత్తులో స్వాధీన పరచుకొను / సంపాదించుకొను ఇతర భూభాగాలు (Such other teritories as may be acquired).

## ఆర్టికల్ 2: నూతన రాష్ట్రాలను స్థాపించుట, చేర్చుకొనుట

పార్లమెంట్ ఒక శాసనం ద్వారా ఉచితమని భావించు షరతుల మీద నూతన రాష్ట్రములను చేర్చుకొనుట, స్థాపించుట చేయవచ్చును.

## ఆర్టికల్ 3

## కొత్త రాష్ట్రాల ఏర్పాటు, రాష్ట్ర పరిధులు, విస్తీర్ణాల మార్పు, పేరు మార్పు:

పార్లమెంట్ ఒక శాసనం ద్వారా –

ఎ) ఒకటి, రెండు అంతకు మించిన రాష్ట్రాలను కలిపి ఒక రాష్ట్రాన్ని మరియు ఒకటి రెండు అంతకు మించిన రాష్ట్రాల నుంచి కొంత భూభాగాలను విడదీసి ఆ భాగాలను ఒక నూతన రాష్ట్రంగా, ఏదైనా ఒక రాష్ట్రం నుంచి కొంత భాగాన్ని వేరొక రాష్ట్రానికి కలిపి ఒక నూతన రాష్ట్రంగా ఏర్పర్చవచ్చు.

బి) రాష్ట్రాల సరిహద్దులను పెంచవచ్చు.

సి) రాష్ట్రాల సరిహద్దులను తగ్గించవచ్చు.

డి) రాష్ట్ర హద్దులను మార్చవచ్చు.

ఇ) రాష్ట్రాల పేర్లను మార్చవచ్చు.

అయితే, పై విషయాలకు సంబంధించిన బిల్లును రాష్ట్రపతి సిఫార్సు లేకుండా లోక్‌సభ లేక రాజ్యసభలో ప్రవేశపెట్టరాదు. మరియు విస్తీర్ణము, హద్దులు, రాష్ట్రాల పేర్లతో ప్రమేయం ఉన్న అన్ని శాసనసభలకు ఆ బిల్లుపై వారి అభిప్రాయాన్ని ఒక నిర్ణయించిన కాలంలో అందజేయ వలసిందిగా రాష్ట్రపతి కోరాలి. మరియు అభిప్రాయాలను అందించుట కొరకై రాష్ట్రపతి శాసనసభలకు నిర్ణయించిన కాలపరిమితి లేక పొడిగించిన కాల పరిమితి గడచిన అనంతరం మాత్రమే రాష్ట్రపతి సిఫార్సును చేయగలడు.

## ఆర్టికల్ 4

రాజ్యాంగంలోని రెండు (2) మూడు (3) ఆర్టికల్స్ కింద చేయబడిన శాసనాలు రాజ్యాంగ సవరణలుగా పరిగణించబడవు.

1) రాజ్యాంగంలోని 2) లేక 3) ఆర్టికల్ పరిధిలో ఏదైనా శాసనం రూపొందించ బడినప్పుడు, సదరు శాసనాలలోని అంశాలకు అనుగుణంగా రాజ్యాంగంలోని మొదటి షెడ్యూలు, నాల్గవ షెడ్యూలులో చేయవలసిన మార్పులకు సంబంధించిన విషయాలకు సంబంధించిన వివరాలు కూడా ఆ శాసనంలో పొందుపరచాలి. ఆ క్రమంలో సదరు శాసనం వల్ల ప్రభావితం అయ్యే రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం, ఆయా రాష్ట్రాల శాసనసభలలోని సభ్యుల సంఖ్య,

తదితర అనుబంధ, అనుషంగిక అంశాల గురించి ఆ శాసనంలో ప్రస్తావన ఉండాలె.

2) పైన ఉదహరించిన వివరాలతో కూడిన శాసనం ద్వారా, రాజ్యాంగానికి చేయబడిన సవరణలు ఆర్టికల్ 368 క్రింద రాజ్యాంగ సవరణలుగా పరిగణించ బడవు.

# భారత రాజ్యాంగం పార్ట్ - 2
# పౌరసత్వం గురించిన ఆర్టికల్స్ ఉన్నాయి

**ఆర్టికల్స్ 5-11**

**ఆర్టికల్ 5, 6, 7, 8, 9, 10, 11 లు భారత పౌరసత్వమునకు సంబంధించినవి.**

# భారత రాజ్యాంగం పార్ట్-3

## ఆర్టికల్ 12: ప్రాథమిక హక్కులు - సాధారణ వివరణ

రాజ్యాంగం మూడవ పార్టులో ఉపయోగించిన (రాజ్యం)లో స్టేట్ అను పదానికి విస్తారమైన అర్థం ఉంది. ప్రభుత్వాలు, పార్లమెంట్, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, స్థానిక సంస్థలు అధీకృత సంస్థలు, పరిపాలనాధికారం గల సంస్థలు, న్యాయ నిర్ణయాధికారం గల సంస్థలు, సందర్భానుసారంగా కొందరు వ్యక్తులు ఇమిడి ఉన్నట్లు అన్వయించుకోవాలె.

ఆర్టికల్ 12 ద్వారా పార్ట్-3లో ప్రాథమిక హక్కులను పార్ట్-4లో స్టేట్ పాలసీల ఆదేశిక సూత్రాలను నిర్వచించింది.

In this Part, unless the context otherwise requires, "the State" includes the Government and Parliament of India and the Government and the Legislature of each of the States and all local or other authorities within the territory of India or under the control of the Govenrment of India.

## ఆర్టికల్ 12: నిర్వచనం

ఈ విభాగానికి సంబంధించి సందర్భానుసారంగా ప్రత్యేక అర్థం ధ్వనించని యెడల, రాజ్యం అంటే భారత ప్రభుత్వం, పార్లమెంటు, రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర

శాసనసభలు, భారతదేశ పరిధిలోని స్థానిక సంస్థలు, అధికార సంస్థలు  లేదా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోని స్థానిక సంస్థలు, అధికార సంస్థలు అని అర్థం.

## ఆర్టికల్ 13

## ప్రాథమిక హక్కులతో సరిపడనివి, అపవాదమైనవి అయిన చట్టములు

1) భారత రాజ్యాంగం 26 జనవరి 1950 నుండి అమలు ప్రారంభమైంది. అందువల్ల భారత రాజ్యాంగంలోని అంశాలకు భిన్నమైన, వ్యతిరేకమైన శాసనాలు  అంతదాకా ఉన్నవి ఏవీ చెల్లనేరవు. ప్రాథమిక హక్కులకు భంగకరమైన నిబంధనలు ఉన్నయెడల ఆ మేరకు ఆ శాసనాలు చెల్లవు.

2) ఇకముందు కూడా ఈ పార్ట్‌లో ధృవపరిచిన, సంక్రమింపచేయబడిన ప్రాథమిక హక్కులను కుదించు, హరించువేయు లేక ఉపసంహరించు విధంగా చట్టాలను రాజ్యం, ప్రభుత్వం చేయరాదు. ఒక శాసనంలో ఏదైనా ఒక భాగం ఈ క్లాజుకు విరుద్ధంగా ఉన్నట్లయితే ఆ భాగం చెల్లదు.

3) సందర్భానుసారంగా ప్రత్యేక అర్థం ధ్వనించని యెడల ఈ ఆర్టికల్‌కు సంబంధించి -

   ఎ) ఈ ఆర్టికల్‌లో చట్టం అనగా ఆర్డినెన్స్, ఆర్డర్ (ఉత్తర్వు) బై-లా, రూలు, రెగ్యులేషన్, నోటిఫికేషన్, శాసనసభ సంతరించుకున్న ఆచార సంప్రదాయా లన్నీ  'శాసనం'గానే పరిగణించబడతాయి.

   బి) ఈ రాజ్యాంగం అమలులోకి రాకపూర్వం భారత భూభాగంలోని శాసనసభ, లేక మరేదైనా చట్టసభ అథారిటీ ఇచ్చే రూపొందించబడే అప్పటివరకు రద్దుకాబడని శాసనాలన్నీ అమలులో ఉన్న శాసనాలుగా పరిగణించబడతాయి.  (ఈ సందర్భంలో అటువంటి శాసనాలు పూర్తిగా గానీ, పాక్షికంగా గానీ ఏ మాత్రం ఆచరణలో లేకపోయినా, లేక కొన్ని ప్రాంతాలలో ఆచరణలో లేకపోయినా అది అప్రస్తుతం).

4) 368 ఆర్టికల్ కింద రాజ్యాంగాన్ని సవరించుటకు ఈ ఆర్టికల్ అడ్డు రాదు. (ఈ నాల్గవ క్లాజు, భారత రాజ్యాంగం 34వ సవరణ ద్వారా 1974లో అదనంగా చేర్చబడింది. 34వ రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూలు సవరించబడింది. 7-9-1974 నుండి ఈ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చింది.

## ఆర్టికల్ 14: చట్టం ముందు అందరూ సమానులే

భారత భూభాగ పరిధిలో చట్టం ముందు అందరూ సమానులే. చట్టం నుండి ప్రజలందరికీ సమాన రక్షణ లభిస్తుంది. పౌరులకు గల ఈ హక్కును ప్రభుత్వం ఏ పౌరునికీ నిరాకరించరాదు. (State shall not deny to any person equality before law or the equal protection of laws with in the territory of India).

## ఆర్టికల్ 15

**ఆర్టికల్ 15 ద్వారా రాజ్యాంగం మత, జాతి, రేస్, కులం, లైంగికత లేదా పుట్టిన ప్రదేశం పేరిట విచక్షణలను నిషేధిస్తుంది.**

Prohibition of discrimination on grounds of religion, race, caste, sex or place of birth (మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా చూపే వివక్షత నిషేధించబడింది.)

1. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా రాజ్యం పౌరుల పట్ల వివక్షతను చూపరాదు.
2. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా ఏ పౌరుడూ ఏ విధమైన అనర్హతలకు, బాధ్యతలకు, ప్రతిబంధకములకు గురి చేయబడరాదు.
   - ఎ) ప్రత్యేకంగా ప్రజలందరూ ఉపయోగించే షాపులు, హోటళ్ళు, విశ్రాంతి, వినోద గృహాలు స్థలాలు అనుభవించుటయందు
   - బి) సర్వజనుల ఉపయోగార్థం అంకితమైన పాక్షికంగా కానీ, పూర్తిగా కానీ రాజ్య నిధులతో నిర్వహింపబడుతున్న బావులు, చెఱువులు, స్నానఘట్టాలు, రహ దారులు, విహారస్థలాలు వీటి అనుభవంలో ఏ వ్యక్తిని అభ్యంతర పరచరాదు.
3. అయినప్పటికీ ఈ ఆర్టికల్‌లోని అంశాలు ఏవీ స్త్రీలకు మరియు పసివారి సంక్షేమం కొరకు ప్రత్యేక రక్షణలను ఏర్పరుచుటయందు రాజ్యానికి ఉన్న అధికారానికి అడ్డురావు.
4. ఈ ఆర్టికల్‌లోని అంశములు ఏవీ మరియు ఆర్టికల్ 29 క్లాజ్ (2)లోని అంశములు షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికి మరియు సాంఘికంగాను విద్యలోను వెనుకబడిన ఇతర తరగతుల వారికి ప్రత్యేక రక్షణలను ఏర్పర్చుటానికి రాజ్యానికి ఉన్న అధికారానికి అడ్డురావు.

5. పైన ఉదహరించిన అంశాలు ఏవీ షెడ్యూల్ కులాల వారికి, షెడ్యూల్డ్ తరగతుల వారికి, మరియు వెనుకబడిన తరగతుల వారికి విద్యావకాశాలలో కల్పించు రక్షణలను ప్రైవేట్ విద్యా సంస్థలలో, అవి ప్రభుత్వం చేత సహాయం పొందుతున్న లేక పొందనివైనా, ఏర్పరచుటయందు రాజ్యానికి ఉన్న అధికారానికి అడ్డురావు. అయితే, ఈ అధికారం అల్ప సంఖ్యాక వర్గాలు ఏర్పరచుకొను సంస్థలకు వర్తించదు.

**వివరణ:** 15 ఆర్టికల్‌లోని 4వ పాయింట్ (15.4) అనుసరించి బీసీలకు రిజర్వేషన్లు, ప్రత్యేక పథకాలు మొదలైన వాటికి రక్షణ కల్పించడం జరిగింది. (15.4ఎ) అనుసరించి ఎస్సీలకు, ఎస్టీలకు ఉద్యోగాల్లో ప్రమోషన్లు కూడా రిజర్వేషన్లు ప్రవేశపెట్టడం జరిగింది. ఆర్టికల్ 46 ఇందుకు ప్రాతిపదికనిచ్చింది. తమిళనాడు ఉద్యమాల వల్ల ఒకటవ రాజ్యాంగ సవరణతో 15.4, 16.4 ఆర్టికల్స్ చేర్చబడ్డాయి.

## 15.4, 16.4 ఆర్టికల్స్ చారిత్రక ప్రాధాన్యత:

మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 15.4, 16.4 ఆర్టికల్ క్లాజ్, చేర్చడంలో 9వ షెడ్యూల్‌లో 76వ రాజ్యాంగ వసరణ ద్వారా చేర్చడంలో తమిళనాడు రిజర్వేషన్ ఉద్యమాలు ద్రవిడకజగం, డిఎంకే, అన్నాడిఎంకే, దక్షిణాది రాష్ట్రాల ఉద్యమాల ప్రభావం ఎంతో ఉంది. ముఖ్యంగా జస్టిస్ పార్టీ, అదే ఆ తర్వాత పేరు మార్చుకుని ద్రవిడ కజగంగా కొనసాగిన ఉద్యమానికి పెరియార్ రామస్వామి నాయకర్ నాయకత్వం అందించారు. అలా రిజర్వేషన్లను న్యాయస్థానం ద్వారా అడ్డుకోకుండా చేయడంలో పెరియార్ రామస్వామి నాయకత్వంలో సాగిన ఉద్యమాలతో 15.4, 16.4 ఆర్టికల్స్ చేర్చారు. 1951లో చెంపకం దొరైరాజన్ మెడికల్ సీట్లలో రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ వేసిన కేసులో మద్రాసు హైకోర్టు రిజర్వేషన్లు ప్రాథమిక హక్కులకు భిన్నమని రిజర్వేషన్లను కొట్టివేయడం జరిగింది. దాంతో ఉద్యమాలు పెల్లుబికాయి. మొదటి రాజ్యాంగ సవరణతో 15.4, 16.4 ఆర్టికల్స్ చేర్చడం జరిగింది.

ఇలా భారత రాజ్యాంగంలో అంబేద్కర్ తర్వాత రిజర్వేషన్ల రక్షణ కోసం పకడ్బందీగా అమలు జరపడానికి తమిళనాడు ఉద్యమాలు, పెరియార్ రామస్వామి నాయకుల కృషి మరువలేనిది. ఆ తర్వాత రాంమనోహర్ లోహియా, బి.పి. మండల్‌ల కృషి ముందుకు సాగింది.

## ఏ కులం గొప్పది కాదు. ఏ కులం చిన్నది కాదు

15వ ఆర్టికల్ ద్వారా సామాజిక, వర్ణ, కుల, ప్రాంత, భాష, లింగ ప్రాతిపధికలపై అసమానతలను తొలగించి సమానత్వాన్ని ప్రతిపాదిస్తుంది. ప్రతి మనిషికీ ఒకే విలువ, ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. మనుషు లంతా ఒక్కటే అనే మానవీయ సమాజ నిర్మాణం భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యం. అందుకు ఆర్టికల్ 13, 14, 15, 16, 17, 23, 31బి, 368 ఆర్టికల్స్ రక్షణ కల్పిస్తాయి. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం, అందరికీ సమాన అవకాశాలు, సమాన అవకాశాలను అందుకోలేక పోతున్నవారికి ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీల, స్కాలర్‌షిప్‌లు, విశ్వవిద్యాలయాలు, శిక్షణలు, రక్షణలు, రిజర్వేషన్లు మొదలైనవి ఏర్పాటు చేయబడ్డాయి. ఇవన్నీ ఈ ఆర్టికల్స్‌లో పొందుపర్చబడ్డాయి. అందువల్ల 13, 14, 15, 16, 17, 23, 31బి, 368, 9వ షెడ్యూల్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, బలహీన వర్గాలకు అత్యంత ముఖ్యమైనవి.

అయితే ప్రాథమిక హక్కుల పేరిట ఎప్పుడు వీలైతే అప్పుడు న్యాయస్థానాలు ఈ ఆర్టికల్స్ ద్వారా, రిజర్వేషన్ల ద్వారా, రక్షణల ద్వారా లభించే అవకాశాలను కుదిస్తూ, వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. పరిపాలనా యంత్రాంగం, రిజర్వేషన్లను అమలు జరపకుండా, నీరుగారుస్తూ వస్తున్నాయి. అందువల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల కోసం, వారి నియామకాల కోసం యూనియన్, మరియు రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేయడం అవసరం. ప్రతి 6 నెలలకు ఒకసారి, ప్రతి డిపార్ట్‌మెంట్ తమ ఖాళీల మొత్తాన్ని, ఉద్యోగుల నూతన కల్పన మొత్తాన్ని ఈ ప్రత్యేక కమిషన్లకు తెలియజేస్తూ ఉండాలి.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు సమాన ప్రతిపత్తి

బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు, రిజర్వేషన్ కేటగిరిని నింపడానికి ఏర్పాటు చేసే ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పరీక్షల సిలబస్‌ను ప్రత్యేకంగా రూపొందించి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అందించి, అందులో చేర్పించాలి. అప్పుడే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్రత్యేక అంశాలపట్ల శ్రద్ధ, గౌరవం, నైపుణ్యం, చరిత్ర నిర్వహించిన పాత్ర వారిపట్ల అవగాహన అన్ని సామాజిక వర్గాలకు తెలుస్తాయి. ఆయా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల ద్వారా కేజి టు పీజి విద్యతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యాలు పెంచే విధంగా ప్రాథమిక పాఠశాలనుండి విశ్వవిద్యా

లయాల దాకా వాటి బడ్జెట్‌లలో భాగంగా కేటాయించడం జరగాలి. ఇది ప్రస్తుతం 12వ తరగతి వరకు రెసిడెన్షియల్ స్కూళ్ళు కాలేజీలదాకా కొనసాగుతున్నది. దాన్ని విస్తరించి పూర్తిస్థాయి స్వతంత్ర విశ్వవిద్యాలయాలుగా ఎక్కడికక్కడ దేశ వ్యాప్తంగా నెలకొల్పవలసి ఉన్నది. అప్పుడే రిజర్వేషన్లు నింపడంతో పాటు జనరల్ కేటగిరిలో కూడా ఎదగడానికి వీలవుతుంది. అప్పుడే సమాన అవకాశాలు కల్పించినట్లు అవుతుంది. రిజర్వేషన్ అనేది జీవించే హక్కుతో సమానమైనది. అంతకన్నా ముఖ్యమైనది కూడా. అందువల్ల ప్రాథమిక హక్కుల్లో రిజర్వేషన్‌లకు సంబంధించిన అంశాలను భారత రాజ్యాంగం 3, 4, 13 ఆర్టికల్స్‌లలో చేర్చడం కోర్టు పరిధిల నుండి మినహాయించడం అవసరం.

## ఆర్టికల్ 16: ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో సమానావకాశాలు

1. ఆర్టికల్ 16 ద్వారా పబ్లిక్ ఎంప్లాయిమెంట్ అవకాశాల్లో సమాన అవకాశాలను కల్పిస్తుంది.

   1) There shall be equality of opportunity for all citizens in matters relating to employment or appointment to any office under the State.

   2) No citizen shall, on grounds only of religion, race, caste, sex, descent, place of birth, residence or any of them, be ineligible for, or discriminated against in respect of, any employment or office under the State.

      1. రాజ్యంలోని అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రభుత్వ ఉద్యోగ వసతుల్లో పౌరులందరికీ ఈ సమానావకాశాలు ఉండాలి.

      2. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానాలలో అన్నింటిని గాని లేక ఏ ఒక్కటిని గాని కారణంగా, ఉద్దేశించి ప్రభుత్వోద్యోగ అర్హతలలోనూ, ప్రభుత్వోద్యోగముల లోనూ చేర్చుకొనుటలోనూ పౌరులమధ్య వివక్షత చూపరాదు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు

**వివరణ:** బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడే ఆయా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ ఉద్యోగాల్లో 50 శాతం మేరకు గల రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలు జరుగుతాయి.

3. అయినా జన్మస్థానాన్ని బట్టి రాష్ట్ర మరియు కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వోద్యోగాలలోని స్థానిక సంస్థలలోని మరియు స్వాధికార సంస్థలలోని ఉద్యోగాలను స్థానికులకు కేటాయించు విధంగా చట్టాలు చేయు అధికారం పార్లమెంటుకు ఉన్నది. ఈ కేటాయింపు ఏదైనా ఒక తరగతికి లేక కొన్ని తరగతుల ఉద్యోగాలకు పరిమితమయి వుండాలి. ఈ కేటాయింపు ఉద్యోగుల నియామకం కంటే ముందు నిర్ణయించబడినవై ఉండాలి.

**ఆర్టికల్ 16(4) ప్రాధాన్యత**

4. అయినప్పటికీ, వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో, అవకాశాలలో ప్రత్యేక కేటాయింపులను ఏర్పరచు అధికారం రాజ్యానికి ఉంది. వెనుకబడిన తరగతుల వారు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగినంతమంది లేనట్లు రాజ్యం అభిప్రాయ పడినపుడు మాత్రమే తదుచితమైన కేటాయింపులను చేయవచ్చు.

4ఎ. అయినప్పటికీ, షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులములకు చెందిన వారికి ప్రభుత్వోద్యోగాల్లో ప్రమోషన్‌లలో కూడా ప్రత్యేక కేటాయింపులను ఏర్పరచు అధికారం రాజ్యానికి ఉంది. ఉన్నత పదవులలో వారికి సీనియారిటి ప్రసాదించు అధికారము కూడా రాజ్యానికి ఉంది. షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల వారు తగినంత మంది ప్రభుత్వోద్యోగాల్లో లేనట్లు రాజ్యం అభిప్రాయపడినచో తదుచితమైన పదోన్నతులకు అనువైన కేటాయింపులను చేయవచ్చు.

4బి. పైన ఉదహరించిన 4, 4(ఎ)లను అనుసరించి ప్రత్యేకంగా కేటాయించిన స్థానాలు ఏ సంవత్సరములోనైనా భర్తీ కానిచో వాటిని తదుపరి సంవత్సరాల్లో భర్తీ చేయవచ్చు. అట్టి స్థానాల్లో ఏ సంవత్సరములోనైనా భర్తీ చేయవలసిన స్థానాలు కలిపి రిజర్వేషన్ అయ్యే స్థానాలు 50 శాతంకు మించితే ఆ విధంగా పరిగణించుటకు వీలులేదు.

5. అయినప్పటికీ, మతపరమైన సంస్థల నిర్వహణ కొరకు నియమిత మయ్యే ఉద్యోగులూ యాజమాన్య హోదాలో ఉండు వారందరూ

అదే మతమునకు చెందిన వారై ఉండ వలెననుటకు అభ్యంతరము ఉండరాదు.

(ఈ ఆర్టికల్, లేదా 19వ ఆర్టికల్‌లోని క్లాజు (1) లోని సబ్ క్లాజు (జి)లో ఏమి పేర్కొనబడినప్పటికి, సామాజికంగా మరియు విద్యా పరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరుల అభ్యున్నతి కోసం వారు (for the advancement of any socially and educationally backward classes of citizens) లేక షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల వారి అభ్యున్నతి కోసం ప్రయివేటు విద్యా సంస్థలతో సహా అన్ని విద్యా సంస్థలలో వారి ప్రవేశానికి సంబంధించి చట్ట పూర్వకంగా ప్రత్యేకమైన నిబంధనలను ప్రభుత్వం జారీ చేయవచ్చు. (సదరు విద్యా సంస్థ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందుతున్నా, పొందక పోయినా, ఈ నియమం వర్తిస్తుంది). అయితే, 30వ అధికరణంలో ఉదహరింపబడిన అల్ప సంఖ్యాకుల విద్యా సంస్థలకు ఈ క్లాజు వర్తించదు. (ఈ క్లాజు 93వ రాజ్యాంగ సవరణ ద్వారా 2005లో అదనంగా చేర్చబడింది).

రాజ్యాంగం మొదటి సవరణ ద్వారా 15వ ఆర్టికల్‌కు (4) క్లాజు అదనంగా చేర్చబడింది. అలా విద్యారంగంలో రిజర్వేషన్లకు రక్షణ కల్పించడం జరిగింది. మండల కమిషన్ సిఫారసులను అనుసరించి న్యాయస్థానాల తీర్పుల తదనంతరం కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో వెనుకబడిన తరగతుల వారికి 27 శాతం కోటాను రిజర్వేషన్లు కల్పిస్తూ, 2007లో కేంద్ర ప్రభుత్వం యాక్ట్ నెం. 5/2007ను తెచ్చింది. ఆ చట్టంలోని సెక్షన్ 3లో వెనుకబడిన తరగతు లను సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరులుగా కేంద్ర ప్రభుత్వం చేత గుర్తించబడినవారు అని పేర్కొనడం జరిగింది. రిజర్వేషన్లకోటాను 69 శాతానికి పెంచుతూ తమిళనాడు ప్రభుత్వం ఒక చట్టాన్ని తెచ్చింది. ఆ చట్టం పేరు తమిళనాడు వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (విద్యాసంస్థల్లో, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు) చట్టం 1993.

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ చట్టానికి రక్షణ కల్పించడానికి, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకుండా చూడడానికి 9వ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది. ఈ శాసనాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చుడానికి 76వ రాజ్యాంగ సవరణ జరిగింది. వీటన్నిటికి ఆర్టికల్ 46 ప్రాతిపదిక. ప్రాథమిక హక్కుల ఆర్టికల్స్ కన్నా 46వ ఆర్టికల్ అధిక ప్రాధాన్యత గల ప్రాథమిక హక్కులకు సంబంధించినది.

## ఆర్టికల్ 17: అస్పృశ్యత, అంటరానితనం నిషేధించబడింది

అంటరానితనం, కుల వివక్ష, కుల దూషణ శిక్షార్హమైన నేరం.

**వివరణ:** ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989లో వచ్చింది. కారంచెడు హత్యాకాండ తర్వాత పెద్ద ఎత్తున సాగిన ఉద్యమాలు, పార్లమెంట్ సభ్యులు పట్టుబట్టడంతో ఈ చట్టం వచ్చింది. కులం పేరుతో అవమానిస్తే అంటరానితనాన్ని పాటిస్తే ఏడేళ్ళదాక శిక్ష. ఇందుకు ప్రత్యేకమైన కోర్టులు కూడా ఏర్పడ్డాయి.

సర్వమానవ సౌభ్రాతృత్వం ఈ ఆర్టికల్‌కు మూలం. అంటరానితనం, కుల వివక్ష అనేవి గత చరిత్రకాలపు పరిణామాల, అవశేషాల కొనసాగింపు.

## ఆర్టికల్ 18: బిరుదుల రద్దు

## ఆర్టికల్ 19: భావ ప్రకటనా స్వేచ్ఛ మొదలైనవి

1. పౌరులందరూ ఈ క్రింద ఉదహరింపబడిన హక్కులను కలిగి ఉంటారు:
   - ఎ) భావ ప్రకటనా స్వేచ్ఛ.
   - బి) ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశం జరుపుకొను స్వేచ్ఛ.
   - సి) అసోసియేషన్లు, లేక యూనియన్లు, లేక సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొను హక్కు (97వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సహకార సంఘాలు' అనే పదం చేర్చబడింది. 13-2-2012)
   - డి) భారతదేశమంతా స్వేచ్ఛగా సంచరించే హక్కు.
   - ఇ) భారత భూభాగంలో ఏ ప్రాంతంలో అయినా నివసించే హక్కు.
   - ఎఫ్)(ఆస్తి హక్కుకు సంబంధించిన ఈ క్లాజు 1978లో, 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా తొలగించబడినది).
   - జి) ఏవిధమైనా వృత్తినైనా, వ్యాపారాన్ని అయినా చేసుకునే హక్కు.

2) క్లాజు (1)లోని సబ్ క్లాజు (ఎ)లో ఏమి చెప్పినప్పటికి భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ దృష్ట్యాగాని, లేక దేశ భద్రత దృష్ట్యాగాని, లేక విదేశాలతో సంబంధాల దృష్ట్యాగాని, లేక శాంతిభద్రతలు, నైతిక విలువలు, సభ్యత, కోర్టు ధిక్కారం, పరువునష్టం, నేరాలు చేయుట, ప్రోత్స హించుట మొదలైన వాటిని నియంత్రించే లక్ష్యంతోగాని, క్లాజు (ఎ)లో

ఉదహరింపబడిన పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛపై హేతుబద్ధమైన ఆంక్షలు, పరిమితులను విధిస్తూ చేయబడి, ప్రస్తుతం అమలులో ఉన్న శాసనాలను ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు. అదేవిధంగా, పైన ఉదహరింపబడిన ఆంక్షలు, పరిమితులకు సంబంధించి శాసనాలను చేయుటకు ప్రభుత్వానికి గల హక్కును కూడా ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు.

3) క్లాజు (1)లోని సబ్ క్లాజు (బి)లో ఏమి చెప్పినప్పటికి, భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ దృష్ట్యాగాని, లేక శాంతి భద్రతల దృష్ట్యాగాని, క్లాజు (బి)లో ఉదహరింపబడిన ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశం జరుపుకొనుటకు ప్రజలకు గల హక్కులపై హేతబద్ధమైన ఆంక్షలు, పరిమితులను విధిస్తూ చేసిన, ప్రస్తుతం అమలులో ఉన్న శాసనములను ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు. అదేవిధంగా, పైన ఉదహరింపబడిన ఆంక్షలు, పరిమితులకు సంబంధించి శాసనాలను చేయుటకు ప్రభుత్వానికి గల హక్కును కూడా ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు.

4. క్లాజు (1)లోని సబ్ క్లాజు (సి)లో ఏమి చెప్పినప్పటికి, భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ దృష్ట్యాగాని, లేక శాంతి భద్రతల దృష్ట్యాగాని, లేక నైతిక విలువల దృష్ట్యాగాని, క్లాజు (సి)లో ఉదహరింపబడిన అసోసియేషన్లు, లేక యూనియన్లు, లేక సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొనే హక్కుపై హేతుబద్ధమైన ఆంక్షలు, పరిమితులను విధిస్తూ చేయబడి, ప్రస్తుతం అమలులో ఉన్న శాసనాలను ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు. అదేవిధంగా, పైన ఉదహరింపబడిన ఆంక్షలు. పరిమితులకు సంబంధించి శాసనాలను చేయుటకు ప్రభుత్వానికి గల హక్కును కూడా ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు.

5. క్లాజు (1)లోని సబ్ క్లాజు (డి) (ఇ)లలో ఏమి చెప్పినప్పటికి, ప్రజా సంక్షేమం దృష్ట్యాగాని, లేక ఏదైనా షెడ్యూల్డు తెగల హక్కుల సంరక్షణ దృష్ట్యాగాని, (డి) (ఇ) క్లాజులలో ఉదహరించిన స్వేచ్ఛగా సంచరించే హక్కు, ఏ ప్రదేశంలో అయినా నివశించే హక్కుపై హేతుబద్ధమైన ఆంక్షలు, పరిమితులను విధిస్తూ చేయబడి, ప్రస్తుతం అమలులో ఉన్న శాసనములను ఈ అధికరణం ప్రభావితం చేయదు. అదేవిధంగా, పైన ఉదహరించిన

ఆంక్షలు, పరిమితులకు సంబంధించి శాసనము లను చేయుటకు ప్రభుత్వానికి గల హక్కును కూడా ఈ అదికరణం ప్రభావితం చేయదు.

6. క్లాజు (1)లోని సబ్ క్లాజు (జి)లో ఏమి చెప్పినప్పటికి, ప్రజా సంక్షేమం దృష్ట్యా, వృత్తి, వ్యాపారాలకు సంబంధించి ఆ క్లాజులో ఉదహరింప బడిన స్వేచ్ఛపై హేతుబద్ధమైన ఆంక్షలు, పరిమితులను విధిస్తూ చేయబడి, ప్రస్తుతం అమలులో ఉన్న శాసనాలను ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు. అదేవిధంగా, పైన ఉదహరింపబడిన ఆంక్షలు, పరిమితులకు సంబంధించి శాసనాలను చేయుటకు ప్రభుత్వానికి గల హక్కును కూడా ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు.

ప్రత్యేకించి ఈ క్రింది అంశాలకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న శాసనాలను ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు. అదేవిధంగా, ఈ క్రింది అంశాలకు సంబంధించి శాసనాలను రూపొందించుటకు ప్రభుత్వానికి గల అధికారాలను కూడా ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు.

1) ఏదైనా వృత్తి, వ్యాపారం చేయుటకు అవసరమైన వృత్తిపరమైన, మరియు సాంకేతిక పరమైన అర్హతలకు సంబంధించిన శాసనాలు లేక 2) ప్రభుత్వం, లేక కార్పొరేషన్లకు చెందిన, లేక వాటి నియంత్రణలో గల వ్యాపారం, పరిశ్రమలు, సేవా రంగాలలో ప్రజలు పూర్తిగా గాని, పాక్షికంగా గాని, ప్రవేశించకుండా నిషేధించటానికి సంబంధించిన శాసనములు. ఈ అంశములపై శాసనాలు చేయుటకు ప్రభుత్వానికి గల హక్కును కూడా ఈ ఆర్టికల్ నియంత్రించదు.

## 19వ ఆర్టికల్ పై ఒక సమీక్ష

రాజ్యాంగంలోని 19వ ఆర్టికల్‌లోని వచనం పై సంక్షిప్తంగా ఒక సమీక్ష చేద్దాం. ఈ ప్రకరణలో రెండు భాగాలు ఉన్నాయి. అవి: 19(1) మరియు 19(2) నుండి 19(6), 19(1) ప్రకారం "పౌరులందరూ ఈ క్రింది స్వేచ్ఛలు కలిగి ఉంటారు".

ఎ) భావ ప్రకటనా స్వేచ్ఛ

బి) ఆయుధములు లేకుండా శాంతియుతంగా సమావేశం జరుపుకునే స్వేచ్ఛ

సి) అసోసియన్లు లేక యూనియన్లు (లేక సహకార సంఘాలను) ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ.

డి) భారతదేశమంతటా స్వేచ్ఛగా సంచరించే స్వేచ్ఛ.

ఇ) భారత భూభాగంలో ఏ ప్రాంతంలో అయినా నివసించే స్వేచ్ఛ.

ఎఫ్) తొలగించబడింది (42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976).

జి) ఏవిధమైన వృత్తినైనా, వ్యాపారాన్ని అయినా చేసుకునే స్వేచ్ఛ

**వివరణ:** 19(1)లోని జి సబ్ క్లాజు 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించబడింది. 19(1)లోని సబ్ క్లాజు 'సి)ని 2011లో 97వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చడం అయింది).

19(1)లో పొందుపరిచినపై ఆరు స్వేచ్ఛలు 'పౌరులకు', పౌర, రాజకీయ స్వేచ్ఛని ప్రసాదిస్తాయి. (ప్రజాస్వామ్య విజయానికి ఇవి ఎంతో అవసరం. ఉదాహరణకు 19(1) (సి)లో పేర్కొన్న అసోసియన్లు లేదా యూనియన్లు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛలో 'రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసుకునే హక్కు' ఉంది. ఇదేవిధంగా 19(1) (ఎ) లో ఉన్న 'భావ ప్రకటనా స్వేచ్ఛ'లో 'సమాచార హక్కు' ఉందని న్యాయస్థానాలు అనేక తీర్పులలో పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో సమాచార హక్కు కోసం అనేక ఉద్యమాలు జరిగాయి. ఈ కారణంగా పార్లమెంట్ 'సమాచార హక్కు' చట్టాన్ని ఆమోదించింది. ఇది అక్టోబర్, 2005లో అమలులోనికి వచ్చింది. ఈ హక్కుకు రాజ్యాంగ హెూదా ఇవ్వాలని ఉద్యమాలు జరుగుతున్నాయి.

## ఆర్టికల్ 20: ఒకే నేరానికి ఒకేసారి శిక్ష విధించాలి

1. చట్టాన్ని ధిక్కరించి నేరం చేసిన సందర్భాలలో మాత్రమే నేరస్థుడిని శిక్షించ వలసి ఉంటుంది. ఏ చట్టము క్రింద నేరము చేయబడిందో, ఆ నేరం జరిగినప్పుడు ఆ చట్టం అమలులో ఉండి తీరాలి. అంతే కాకుండా, ఆ నేరమునకు చట్టములో నిర్దేశింపబడిన దానికన్నా ఎక్కువ శిక్ష విధింపరాదు.

2. ఒకే నారానికి ఒకేసారి విచారణ, శిక్ష ఉండాలి. ఒకసారి విచారణ జరిగిన తర్వాత, తిరిగి అదే నేరానికి మరొకసారి విచారించరాదు.

3. నేరం ఆరోపించబడిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా తానే సాక్ష్యం చెప్పవలసిందిగా బలవంతం లేక ఒత్తిడి చేయరాదు.

## ఆర్టికల్ 21: వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కు

చట్టం నిర్దేశించిన విధంగా తప్ప, మరొక విధంగా వ్యక్తికగల జీవించే హక్కును గాని, అతనికి గల వ్యక్తి స్వేచ్ఛనుగాని హరించరాదు.

## ఆర్టికల్ 21ఎ: విద్యా హక్కు

2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21ఎ ఆర్టికల్ చేర్చబడింది. ఇది ఈ విధంగా పేర్కొంటుంది.

21ఎ ఆర్టికల్: విద్యా హక్కు ఆరు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నిర్బంధ ఉచిత విద్యను నేర్పుట ప్రభుత్వ భాద్యత. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం రూపొందించుకోవాలి.

**వివరణ:** అనేక తీర్పులలో న్యాయస్థానాలు విద్యా హక్కుని జీవించే హక్కుగా పరిగణించాయి. ఉదాహరణకు ఉన్నికృష్ణన్ v ఆంధ్రప్రదేశ్ (AIR 1993, SC 2178) లో సుప్రీంకోర్టు విద్యాహక్కుని ప్రాథమిక హక్కుగా గుర్తించింది. మొహినీజైన్ (AIR 1992 SC 1858) లో విద్యాహక్కు లేకపోతే వ్యక్తి గౌరవానికి, జీవించే హక్కుకి అర్థంలేదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగ సమీక్షా సంఘం కూడా దీనిని గుర్తించి, దీనికోసం రాజ్యాంగ సవరణ చట్టం చేయాలని సిఫార్సు చేసింది. ఈ కారణంగా చివరికి భారత పార్లమెంట్ 86వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002 ద్వారా విద్యాహక్కుని గుర్తించి రాజ్యాంగంలో 21ఎ ని చేర్చింది. ఈ ఆర్టికల్‌లోని అంశం పైన ఇవ్వబడింది.

86వ రాజ్యాంగ సవరణ చట్టం రాజ్యాంగంలో 3వ భాగంలో 21A ని చేర్చడమే కాక, 4వ భాగంలోని ఆదేశ సూత్రాలలో ఈ అంశానికి సంబంధించిన 45వ ఆర్టికల్‌ను సవరించింది. ప్రాథమిక విధానాలలో (4A) కూడా 51Aకి K అనే సబ్ క్లాజుని చేర్చి విద్యాహక్కుకి తల్లిదండ్రుల భాద్యతను కూడా చేర్చింది.

ఈ విధంగా విద్యాహక్కు అనే అంశం రాజ్యాంగంలోని 3వ భాగాన్ని, 4వ భాగాన్ని మరియు 4A భాగాన్ని ప్రభావితం చేసింది. ఈ విధంగా రాజ్యాంగంలో ఈ విద్యా హక్కు (RTE) ప్రముఖ స్థానాన్ని పొందింది.

ఐక్యరాజ్యసమితిలో కూడా సార్వజనీన మానవ హక్కుల ప్రకటన 26(1) నిబంధన ప్రకారం విద్యాహక్కుని మానవ హక్కుగా గుర్తించింది.

చివరికి, కేంద్ర శాసనసభ 21ఎలో నిర్దేశించిన ప్రకారం 'The Right of Children to Free and Compelsery Education Act, 2009 చట్టం చేసింది. దాన్ని రాష్ట్రపతి 26 ఆగష్టు, 2009 నాడు ఆమోదించారు. 1 ఏప్రిల్ 2010 నుండి ఇది అమలులోనికి వచ్చింది.

## ఆర్టికల్ 22: నిర్బంధం-పరిమితులు

1) ఒక వ్యక్తి అరెస్టు కాబడి, నిర్బంధంలో ఉంచబడినప్పుడు, సాధ్యమైనంత త్వరగా అరెస్టుకు గల కారణాలను అతనికి తెలియపరచాలి. అంతేగాక. తనకు ఇష్టమైన అడ్వకేట్‌ను నియమించుకొనే హక్కు అతనికి ఉంటుంది. ఆ హక్కును అతనికి నిరాకరించరాదు.

2) అరెస్టు కాబడి, నిర్బంధంలో ఉంచబడిన 24 గంటల లోపల ఆ వ్యక్తిని సమీపంలోని మేజిస్ట్రేటు ఎదుట హాజరు పరచాలి. (అరెస్టు చేసిన ప్రదేశం నుండి మేజిస్ట్రేటు కోర్టుకు తీసుకొని పోవటానికి పట్టే సమయాన్ని మినహాయించాలి). మేజిస్ట్రేటు అనుమతి లేనిదే, 24 గంటలకు మించి ఏ వ్యక్తినీ నిర్బంధంలో ఉంచరాదు.

3) అయితే, ఈ క్రింది సందర్భాలకు (1) మరియు 92) క్లాజులలోని నియమాలు వర్తించవు.

   ఎ) అరెస్టు చేయబడిన వ్యక్తి శత్రుదేశానికి చెందినవాడైన సందర్భంలో (లేక)

   బి) ముందు జాగ్రత్తగా నిర్బంధంలో ఉంచుటకు (ప్రివెంటివ్ డిటెన్షన్) సంబంధించిన శాసనాలు క్రింద ఒక వ్యక్తిని అరెస్టుచేసిన సందర్భాలు.

4) సాధారణ పరిస్థితులలో ప్రివెంటివ్ డిటెన్షన్‌కు సబంధించిన శాసనాల క్రింద అరెస్టు కాబడిన వ్యక్తిని మూడు మాసాలకు మించి నిర్బంధంలో ఉంచరాదు. అయితే ఈ క్రింది సందర్భాలకు ఈ నియమం వర్తించదు.

   ఎ) హైకోర్టు న్యాయమూర్తులు, లేక హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించ బడుటకు అర్హత కలిగిన వ్యక్తులతో ఏర్పాటు కాబడిన సలహా సంఘం, ఆ వ్యక్తిని నిర్బంధంలో ఉంచుట సమంజసమేనని ప్రభుత్వానికి నివేదిక పంపిన సందర్భాలు. (మూడు మాసాల నిర్బంధ కాలపరిమితి తీరక ముందే ఆ విధంగా రిపోర్టు పంపబడి ఉండాలి.

   అయినప్పటికి, క్లాజు (7)లోని సబ్ క్లాజు (ఎ) లేక (బి) క్రింద పార్లమెంటు నిర్దేశించిన కాలపరిమితికి మించి ఏ వ్యక్తినీ నిర్బంధంలో ఉంచరాదు. (లేక)

బి) క్లాజు (7)లోని సబ్ క్లాజు (ఎ) లేక (బి) క్రింద పార్లమెంటుచే ఆమోదించబడిన శాసనం క్రింద మాత్రమే ఆ వ్యక్తి నిర్బంధించబడి ఉండాలి.

5) ప్రివెంటివ్ డిటెన్షన్‌కు అవకాశం కలిగించు శాసనం క్రింద మాత్రమే ఒక వ్యక్తి నిర్బంధించబడినప్పుడు, సాధ్యమైనంత త్వరగా, అతని నిర్బంధానికి గల కారణాలను అతనికి తెలియపరచాలి. ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రభుత్వానికి పిటిషన్ (రిప్రజెంటేషన్) దాఖలు చేసుకొనే అవకాశం అతనికి కల్పించాలి.

6) అయినప్పటికి, (5)వ క్లాజులో ఏమి పేర్కొనబడినప్పటికి, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా, నిర్బంధానికి గల కారణాలను అతనికి వెల్లడించటానికి నిరాకరించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

7) ఈ క్రింది అంశాలపై శాసన పూర్వక నిబంధనలను జారీచేసే అధికారం పార్లమెంటుకు ఉంటుంది:

ఎ) క్లాజు (4), సబ్ క్లాజు (ఎ)లో ఉదహరింపబడిన సలహా సంఘం యొక్క అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే, కొన్ని రకాల కేసుల విషయంలో ప్రివెంటివ్ డిటెన్షన్ క్రింద ఒక వ్యక్తిని మూడు మాసాలకన్నా ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచుటకు అవకాశం కల్పిస్తూ శాసనాలను చేయవచ్చు.

బి) కొన్ని తరహాల కేసుల విషయంలో గరిష్ట ప్రివెంటివ్ డిటెన్షన్ కాలపరిమితికి సంబంధించిన శాసనాలు చేయవచ్చు.

సి) క్లాజు (4), సబ్ క్లాజు (ఎ) క్రింద సలహా సంఘం విచారణ జరుపు విధానాన్ని నిర్దేశిస్తూ శాసనాలు చేయవచ్చు.

## ఆర్టికల్ 23: దోపిడీ నుండి రక్షణ పొందే హక్కు – శ్రమ శక్తిని దోపిడీ చేయరాదు

1) సంఘ వ్యతిరేక, చట్ట వ్యతిరేక చర్యల నిమిత్తం మనుషులతో వ్యాపారం చేయించటం, ప్రతిఫలం లేకుండా పని చేయించుకోవటం, బలవంతంగా శ్రమ చేయించటం నిషేధింపబడింది. ఈ ఆర్టికల్‌లోని నిబంధనలను

అతిక్రమించటం శిక్షార్హమైన నేరం. చట్ట ప్రకారం అందుకు తగిన శిక్ష విధింపబడుతుంది.

2) అయితే, ప్రజా సంక్షేమం దృష్ట్యా, నిర్బంధంగా శ్రమ చేయించుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఆ విధంగా నిర్బంధంగా శ్రమ చేయించుకునే క్రమంలో మత, కుల, జాతి, లేక వర్గం ప్రాతిపదికపై ఎటువంటి వివక్షత చూపరాదు.

## ఆర్టికల్ 24: కర్మాగారాలలో చిన్న పిల్లలచేత పనిచేయించడం, ఫ్యాక్టరీల్లో నియామకం, నిషేధం

14 సంవత్సరాల వయసు నిండని పసివారిని కర్మాగారాలలో, భూగర్భాలలో ప్రమాదకరమైన పనులలో నియమించరాదు.

ఆర్టికల్ 24 ద్వారా 14 ఏళ్ళలోపు పిల్లలను ఫ్యాక్టరీలలో ఇతరత్రా పని చేయించడాన్ని నిషేధిస్తుంది. కర్మాగారాలలో పసివారి నియామకం, నిషేధం 14 సంవత్సరాల వయసు నిండని పసివారిని కర్మాగారాలలో, భూగర్భాలలో యందు, ప్రమాదకరమైన పనులలో నియమించరాదు.

## ఆర్టికల్ 25: మత స్వాతంత్ర్యపు హక్కు

**ఆర్టికల్ 25 ద్వారా ఉపాధి స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ.**

1) Subject to public order, morality and health and to the other provisions of this Part, all persons are equally entitled and freedom of conscience and the right freely to profess, practise and propagate religion.

**మనసారా నమ్మే విశ్వాసాలకు, మత ప్రచారాలకు స్వాతంత్ర్యం.**

1) భారతదేశంలోని ప్రజలందరూ తమకు ఇష్టమైన (మత) విశ్వాసాలను కలిగి ఉండవచ్చు. ఏ మతాన్ని అయినా స్వీకరించవచ్చు. ఆచరించవచ్చు. ప్రచారం చేసుకోవచ్చు. ఈ హక్కు అందరికీ సమానంగా ఉంటుంది. అయితే ఈ హక్కు, ఈ విభాగంలోని ప్రజా సంక్షేమం, ఆరోగ్యకరమైన నైతికత మొదలైన నిబంధనలకు లోబడి ఉంటుంది.

2) ఈ ఆర్టికల్‌లో ఏమి పేర్కొనబడినప్పటికి, ఈ క్రింది అంశాలకు సంబంధించి శాసనాలను రూపొందించు అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

అదేవిధంగా, ఈ క్రింది అంశాలకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న శాసనాలను కూడా ఈ ఆర్టికల్ ప్రభావితం చేయదు.

ఎ) మత సంబంధమైన కార్యకలాపాలతో సంబంధం కలిగి ఉన్న ఆర్థిక, రాజకీయ లేక ఇతర సంక్షేమ కలాపాలను నియంత్రిచుట లేక పరిమితు లను విధించుట.

బి) పబ్లిక్ స్వభావము కలిగిన హిందూ మత సంస్థలలో హిందువులలోని అన్ని తరగతులు, వర్గాలవారికి ప్రవేశం కల్పించుట, లేక హిందూ మత సంస్థల సంస్కరణ, సామాజిక సంక్షేమం.

## ఆర్టికల్ 26: మతపరమైన వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు

## ఆర్టికల్ 27: మత ప్రచారం కోసం విధించే పన్నులు ఇతరులు బాధించకూడదు.

## ఆర్టికల్ 28: విద్యాసంస్థల్లో మతపరమైన బోధనలు, పూజల్లో నిర్బంధం ఉండకూడదు.

విద్యాలయాల్లో మతబోధన పనికిరాదు. ప్రభుత్వంచే నిర్వహించబడే విద్యాలయాల్లో ఎటువంటి మతబోధన పనికిరాదు. ప్రభుత్వంచే గుర్తించబడిన, లేక ప్రభుత్వ సహాయం పొందే విద్యాలయాల్లో, ఎయిడెడ్ పాఠశాలల్లో మత పరమైన ప్రార్థనలు కలాపాలు ఉండి ఉండవచ్చు. అయినప్పటికి విద్య అభ్యసించే విద్యార్థులు అటువంటి ప్రార్థనలలో, కార్యకలాపాల్లో విధిగా పాల్గొనకపోవచ్చు.

## ఆర్టికల్ 29: సాంస్కృతిక, విద్యా హక్కులు

1) భారత భూభాగంలో ఏదో ఒక ప్రదేశంలో, ఏదో ఒక మతంలో ఉన్న కొందరు పౌరులు విలక్షణమైన భాషను గాని, లిపినిగాని లేక సంస్కృతిని గాని కలిగి ఉన్నట్లయితే, వారు ఆ భాష, లిపి, సంస్కృతిని పరిరక్షించుకునే హక్కును కలిగి ఉంటారు.

2) ప్రభుత్వంచే నిర్వహించబడే విద్యాలయాలలోగాని, లేక ప్రభుత్వ నిధులనుండి ఆర్థిక సహాయం పొందే విద్యాలయాలలోగాని పౌరులను (విద్యార్థులను) చేర్చుకునే విషయంలో కేవలం మతం, జాతి, కులం, భాషల ప్రాతిపదికపై వివక్షత చూపరాదు. అనగా, కేవలం ఆ కారణాలపై విద్యాలయ ప్రవేశాన్ని నిరాకరించరాదు.

అల్ప సంఖ్యాల సంక్షేమ రక్షణ. ప్రత్యేకమైన భాష, లిపి, సంస్కృతి, మత, జాతి పేరిట ఎవరినీ విద్యార్థిగా చేర్చుకొనుటకు నిరాకరించరాదు.

## ఆర్టికల్ 30: విద్యా సంస్థలను స్థాపించుట, నిర్వహించుట కొరకు అల్ప సంఖ్యాకు లకు కల్పించిన రక్షణలు, హక్కులు

1-ఎ) క్లాజు 1లో ఉదహరింపబడిన అల్ప సంఖ్యాక వర్గాలవారిచే స్తాపించబడి, నిర్వహించబడుతున్న విద్యా సంస్థలు ఆస్తులను తప్పనిసరిగా కలిగియుండుటకు సంబంధించిన శాసనములను రూపొందించే సందర్భంలో సదరు ఆస్తుల విలువను నిర్ధారించటంలోగాని, నిర్ణయించటంలోగాని క్లాజు (1) క్రింద అల్పసంఖ్యాక వర్గాలకు గల హక్కులకు ఎటువంటి భంగము కలుగరాదు. (ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితానుండి తొలగించుతూ 1978లో 44వ రాజ్యాంగ సవరణ చేయబడినప్పుడు ఈ క్లాజు అదనంగా చేర్చబడింది).

2) విద్యా సంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందజేసే క్రమంలో అల్ప సంఖ్యాక వర్గాలచే నిర్వహించబడే విద్యాసంస్థల యెడల ఎటువంటి వివక్షతనూ చూపరాదు. ఆ విద్యాసంస్థ మత పరమైన అల్ప సంఖ్యాక వర్గానికి చెందినా, లేక భాషా పరమైన అల్ప సంఖ్యాక వర్గానికి చెందినా ఇదే నియమం వర్తిస్తుంది.

1) అల్ప సంఖ్యాకులందరికీ మతపరమైనవి అయినా లేక భాషా పరమైనవైనా, వారి సంక్షేమం కొరకు ప్రత్యేకమైన విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని నిర్వహించుకొనే హక్కు ఉన్నది. ఎ) అల్ప సంఖ్యాకుల విద్యాసంస్థలను వాటి ఆస్తులను ప్రభుత్వం సేకరించదలిస్తే పరిహారం కింద ముట్టజెప్పే మొత్తము అల్పసంఖ్యాకుల హక్కులను నిర్మూలించే విధంగా ఉండరాదు.

2) విద్యా సంస్థలకు రాజ్యం మంజూరు చేసే గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను అల్ప సంఖ్యాకులు నిర్వహించే సంస్థలకు నిరాకరించరాదు. అట్టి సంస్థ మతపరమైన అల్పసంఖ్యాకులదైనా లేక భాషాపరమైన అల్ప సంఖ్యాకులదైనా నిరాకరణకు కారణం అల్ప సంఖ్యాకులకు చెందిన సంస్థ అనేది ఒకటే అయితే నిరాకరణ రాజ్యాంగ శాసనబద్ధం కాదు.

## ఆర్టికల్ 31: ఆస్తి హక్కు

## ఆర్టికల్ 31ఎ): భూముల స్వాధీనానికి సంబంధించిన శాసనాలు

1) 13వ ఆర్టికల్‌లో ఏమి పేర్కొనబడినప్పటికి, ఈ క్రింది అంశాలకు

సంబంధించిన శాసనాలు రాజ్యాంగబద్ధ మైనవిగానే పరిగణింపబడతాయి. ఆ శాసనాలు ఈ కింద పేర్కొన్న అంశాలకు సంబంధించినవి.

ఎ) ఎస్టేట్లను (భూములను) స్వాధీనం చేసుకొనుట, లేక ఎస్టేట్లకు సంబంధించిన హక్కులను స్వాదీనం చేసుకొనుట, లేక అటువంటి హక్కులను తొలగించుట, లేక సవరించుటకు సంంధించిన శాసనాలు. (లేక)

బి) ప్రజోపయోగం కొసంగాని, లేక సమర్ధవంతమైన నిర్వహణ కోసంగాని ఏదైనా ఆస్తిని కొద్దికాలంపాటు స్వాధీనం చేసుకొనుటకు సంబంధించిన శాసనాలు. (లేక)

సి) ప్రజోపయోగం కోసంగాని, లేక సమర్ధవంతమైన నిర్వహణ కోసంగాని, ఒక కార్పొరేషన్‌ను మరొక కార్పొరేషన్ లేక కార్పొరేషన్లతో విలీనం చేయుటకు సంబంధించిన శాసనాలు. (లేక)

డి) సదరు కార్పొరేషన్ల యొక్క పాలక మండలి ఏజెంట్లు, కార్యదర్శులు మరియు కోశాధికారులు, మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు లేక మేనేజర్ల యొక్క హక్కులను రద్దు చేయుటకు లేక సవరించుటకు సంబంధించిన శాసనాలు, లేక అటువంటి కార్పోరేషన్ల షేర్ హోల్డర్ల ఓటు హక్కును రద్దు చేయుటకు లేక సవరించుటకు సంబంధించిన శాసనాలు. (లేక)

ఇ) ఖనిజాలు, లేక తైలాల ఉనికిని తెలుసుకొనుటకు సంబంధించి చేసుకొనబడిన ఒప్పందం లేక లైసెన్స్, లేక కౌలుకు సంబంధించిన హక్కులను రద్దు చేయుట లేక సవరించుట, లేక కాల పరిమితి తీరకముందే సదరు ఒప్పందం, లైసెన్స్ లేక కౌలును రద్దు చేయుటకు సంబంధించిన శాసనాలు.

అయితే, పై అంశాలకు సంబంధించిన శాసనాలను ఒక రాష్ట్ర ప్రభుత్వం కనుక రూపొందించి ఉన్నట్లయితే, ఆ శాసనం రాష్ట్రపతికి పంపబడి, ఆయనచే ఆమోదింపబడాలి. అప్పుడే ఈ ఆర్టికల్‌లోని నిబంధనలు అన్వయిస్తాయి.

అదే సమయంలో ఒక వ్యక్తి స్వయంగా సాగు చేసుకుంటున్న భూమిని స్వాధీనం చేసుకొనుటకు సంబంధించిన ఒక శాసనాన్ని ఒక రాష్ట్ర ప్రభుత్వం

రూపొందించి ఉండవచ్చు. అటువంటి సందర్భంలో, అప్పటికే అమలులో ఉన్న భూ గరిష్ట పరిమితి చట్టంలో నిర్దేశింపబడిన పరిమితికన్నా తక్కువగా ఉన్న భూమిని ఆ వ్యక్తి కలిగి ఉన్నట్లయితే, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొన రాదు. (ఆ భూమిలో ఉన్న భవనాలు, కట్టడములతో సహా). అటువంటి భూమిని స్వాధీనం చేసకొనవలెనన్నచో, మార్కెట్ విలువ ప్రకారం ఆ భూమి, ఆ భూమిపై గల భవనాలు, కట్టడముల విలువను నష్టపరిహారంగా చెల్లించవలెను. (1964లో చేయబడిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పేరాగ్రాఫ్ అదనంగా చేర్చబడింది. భూసంస్కరణల అమలులో భాగంగా రైత్వారీ భూములను కూడా భూ గరిష్ట పరిమితి చట్టం క్రిందకు తీసుకువస్తూ ఈ రాజ్యాంగ సవరణ చేయబడింది. 2013లో రాజ్యాంగంలో మరొక సవరణ చేస్తూ వ్యక్తిగత భూములకు మార్కెట్ రేటును అనుసరించి మూడు రెట్లు, నాలుగు రెట్లు చెల్లించాలని సవరణ చేయడం జరిగింది. బెంగాల్, తదితర రాష్ట్రాలలో పరిశ్రమలకు భూముల సేకరణ వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమాల ఫలితంగా ఈ చట్టం చేయబడింది.)

## ఆర్టికల్ 31బి: న్యాయ సమీక్ష పరిధినుంచి మినహాయించిన శాసనాలు (ఈ ఆర్టికల్ 31బి చాలా ముఖ్యమైనది. 9వ షెడ్యూల్ ఈ ఆర్టికల్ ద్వారానే కొనసాగుతున్నది.)

కొన్ని శాసనాలు న్యాయ సమీక్షలకు అతీతంగా కొనసాగుతాయి. దేశ సరిహద్దులు, రాష్ట్రాల ఏర్పాటు మొదలైన వాటి గురించిన రాజ్యాంగంలోని 1,2,3,4 ఆర్టికల్స్ న్యాయ సమీక్ష పరిధిలోకి రావు. వాటిని రాజ్యాంగ సవరణలుగా భావించడానికి వీలులేదు. అలా సామాజిక న్యాయం కోసం, సామాజికన్యాయం కాలానుగుణంగా సాధించడం కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌ను ఆసరా చేసుకుని వాటిని వ్యతిరేకించే అవకాశాల నుండి 31బి ప్రత్యేక రక్షణ కల్పిస్తుంది. 31బి ద్వారా 9వ షెడ్యూలులో చేర్చబడిన రాజ్యాంగ సవరణలు, శాసనాలు సజావుగా ప్రభుత్వాలు కాలానుగుణంగా పనిచేయడానికి సామాజిక న్యాయం, సామాజిక మార్పుకు దోహదం చేయడానికి ఉద్దేశించి 31బి ఏర్పాటు చేయడం జరిగింది. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టినపుడు కోర్టులు తొలుత కొట్టివేశాయి. దానితో రాజ్యాంగాన్ని సవరించి 31బిలో చేర్చి 9వ షెడ్యూల్‌లో 69 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని చేర్చడం జరిగింది. 69శాతం రిజర్వేషన్లు రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించి తమిళనాడు చట్టం 45/94 అని పేర్కొనడం జరిగింది. 45/94 చట్టానికి 9వ షెడ్యూల్, 31బి ఆర్టికల్ మినహాయింపునిస్తుంది.

న్యాయస్థానం కొట్టివేయకుండా రక్షణ కల్పిస్తున్నది. భూ సంస్కరణ చట్టాలను న్యాయస్థానాలు అదే పనిగా కొట్టివేయడం వలన అలాంటి అనేక చట్టాలను 9వ షెడ్యూల్‌లో చేర్చి ఆ చట్టాలను న్యాయ సమీక్ష నుండి మినహాయించడం జరిగింది. ఇలా ఎప్పటికప్పుడు న్యాయస్థానాలు సమీక్షలో ప్రభుత్వ కార్యకలాపాలలో న్యాయ సమీక్షలు అడ్డంకిగా మారాయి. ఆయా చట్టాలపై న్యాయ సమీక్ష చేయకుండా మినహాయించి, రక్షణ కల్పించడం జరుగుతున్నది. ఇదే పద్ధతిలో పార్లమెంటు ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్లు జనాభా దామాషా మేరకు పెంచుకోవడాన్ని న్యాయ సమీక్ష నుండి మినహాయింపు ఇస్తూ 50 శాతం పరిమితిని తొలగించి 31బి, 9వ షెడ్యూలులో చేర్చి ఉండాల్సింది. ఇప్పటికైనా, ఎప్పటికైనా పార్లమెంటు ఈ రాజ్యాంగ సవరణ చేయక తప్పదు. ఈ రాజ్యాంగ సవరణ ఎప్పుడో చేసి ఉంటే దేశం నాలుగు రెట్లు అభివృద్ధి చెంది ఉండేది.

9వ షెడ్యూల్‌లో చేర్చిన అన్ని చట్టాలు, వాటిలోని అంశాలు ఏవైనా రాజ్యాంగ శాసనానికి భిన్నంగా ఉన్నప్పటికి శాసనబద్ధమైనవిగానే భావించాలి. వీటిలో వేటినైనా కోర్టులు రద్దుపరచినా అవి రద్దు అయినట్లు భావించరాదు. 9వ షెడ్యూల్‌లో ఉదహరించిన చట్టాలు వాటికి సంబంధించిన శాసనసభలు ఉపసంహరణ లేక మార్పులు చేసేదాక అమలులో ఉంటాయి.

ఆర్టికల్ 31బి, ప్రజల అవసరాల కొరకు రాజ్యాంగ ఆశయాల స్ఫూర్తితో పార్లమెంట్ చేసిన చట్టాలు ఏవైనా ప్రాథమిక హక్కులకు భంగకరంగా ఉన్నా, వాటికి  ఆమోదం, అమలుకోసం 9వ షెడ్యూల్ జాబితాలో చేర్చటం, ఆమోదం అను ప్రక్రియ ద్వారా రక్షణ కల్పించింది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ. ఏఐఆర్ 1973, ఎస్‌సి 1461, దత్తాత్రేయ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర. ఏఐఆర్ 1989, ఎస్‌సి, 1798.

## ఆర్టికల్ 31సి: ఆదేశిక సూత్రాల లక్ష్య సాధనకై చేయబడిన శాసనాలకు రాజ్యాంగ రక్షణ

13వ ఆర్టికల్‌లో ఏమి పేర్కొనబడినప్పటికి, 39వ ఆర్టికల్‌లో (బి) మరియు (సి) క్లాజులలో ఉదహరింపబడిన లక్ష్య సాధనకు సంబంధించి చేయబడిన కొన్ని శాసనాలు 14 లేక 19 ఆర్టికల్‌లోని ప్రాథమిక హక్కులను హరించేవిగా ఉండవచ్చు. లేక వాటి పరిధిని కుదించవచ్చు. లేక ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉండవచ్చు. అయినప్పటికి అటువంటి శాసనాలు చెల్లుబాటు అవుతాయి.

అటువంటి శాసనాలను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించు అధికారం న్యాయస్థానాలకు ఉండదు. అయితే, ఈ అంశానికి సంబంధించి ఒక రాష్ట్ర శాసనసభ ఒక శాసనం రూపొందించినట్లయితే, ఆ శాసనానికి రాష్ట్రపతి ఆమోదముద్ర లభించితేనే ఈ ఆర్టికల్ వర్తిస్తుంది. (25వ రాజ్యాంగ సవరణ ద్వారా 1971లో ఈ ఆర్టికల్ చేర్చబడింది).

## ఆర్టికల్ 31డి: దేశద్రోహ చర్యల నివారణకు నిర్దేశింపబడిన శాసనములకు రాజ్యాంగ రక్షణ

ఈ ఆర్టికల్ ఇందిరాగాంధీ పరిపాలనా కాలంలో 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా 1977లో చేర్చబడింది. అయితే, ఒక సంవత్సరంలోనే 1979లో జనతా పార్టీ ప్రభుత్వం 43వ రాజ్యాంగ సవరణలో భాగంగా ఈ అధికరణాన్ని తొలగించింది.

## ఆర్టికల్ 32 –35: ప్రాథమిక హక్కుల పరిరక్షణ మార్గాలు:

1) రాజ్యాంగంలోని ఈ విభాగం ద్వారా ప్రజలకు సంక్రమింప జేయబడిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, సమయోచితమైన రీతిలో సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. రాజ్యాంగం ఈ మేరకు హామీ ఇస్తుంది.

2) ప్రాథమిక హక్కులను అమలు చేయుటకు సంబంధించి సమయోచితమైన ఉత్తర్వులను జారీ చేయు అధికారం సుప్రీం కోర్టుకు ఉంటుంది. సుప్రీం కోర్టు ఆ క్రమంలో ఆదేశాలనుగాని, ఉత్తర్వులనుగాని, లేక హెబియస్ కార్పస్, మాండమస్, కో–వారంటో, సర్షియోరరి, ప్రొహిబిషన్ వంటి రిట్ ఆదేశాలను గాని జారీ చేయవచ్చు.

3) ఈ ఆర్టికల్స్‌లోని (1) మరియు (2) క్లాజులలో ఏమి పేర్కొనబడినప్పటికి, క్లాజు (2) క్రింద సుప్రీం కోర్టుకు గల అధికారాలను మరేదైనా హైకోర్టుకు కూడా సంక్రమింపచేస్తూ శాసనము చేయు అధికారం పార్లమెంటుకు కలదు.

4) ఈ రాజ్యాంగంలో సూచించబడిన విధంగా తప్ప, మరొక విధంగా ఈ ఆర్టికల్‌లో ప్రాథమిక హక్కుల పరిరక్షణా హక్కును తీసివేయరాదు.

**వివరణ:** భారత రాజ్యాంగంలో 32వ ఆర్టికల్ అన్నిటికన్నా ముఖ్యమైనదని డా॥ బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. దీని ద్వారానే పౌరులకు రాజ్యాంగ హక్కులను సాధించుకొనే హక్కు కలుగుతుందన్నారు.

**ఆర్టికల్ 32ఏ: శాసనాల రాజ్యాంగ బద్ధతను 32వ ఆర్టికల్ క్రింద ప్రశ్నించరాదు.**

32వ ఆర్టికల్ యొక్క పరిధిని, ప్రభావాన్ని కుదించేందుకు ఉద్దేశింపబడిన ఈ ఆర్టికల్ శ్రీమతి ఇందిరాగాంధీ పరిపాలనా కాలంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో చేర్చబడింది. జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 1978లో జరిగిన 43వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ఆర్టికల్ తొలగించబడింది.

**ఆర్టికల్ 33: ప్రాథమికహక్కులను రక్షణ దళాలకు నిరాకరించు హక్కు పార్లమెంటుకు ఉంటుంది.**

**ఆర్టికల్ 34: మార్షల్ లా ఉంటే ప్రాథమిక హక్కులు ఉండవు.**

**ఆర్టికల్ 35: కొన్ని ప్రాథమిక హక్కులకు సంబంధించి శాసనాలను చేయడంలో పార్లమెంటు అధికారాలు**

# భారత రాజ్యాంగం పార్ట్ - 4
# ఆదేశిక సూత్రాలు

## ఆర్టికల్స్ 36-51

భారత రాజ్యాంగంలో నాల్గవభాగంలో 36నుండి 51వరకు ఉన్న ఆదేశిక సూత్రాలు (Directive principles of state policy) రాజ్యాంగ ప్రవేశికలోని ఆదర్శాల సాధనలో తోడ్పడతాయి. వీటిని రాజ్యాంగ నిర్మాతలు ఐర్లండ్ రాజ్యాంగంనుండి గ్రహించారు. ఇవి న్యాయనిర్హేతుకం కానప్పటికీ, దేశ పరిపాలనలో ఎంతో ప్రధానమైనవి. రాజ్యాధికారాన్ని నిర్వహించే ఏ ప్రభుత్వ మైనా రాజకీయ సిద్ధాంతాలకు అతీతంగా వీటిని ఆచరణలో పెట్టాలి. ప్రాథమిక హక్కుల వలే వీటికి ప్రత్యేకమైన వర్గీకరణను రాజ్యాంగం చేయలేదు.

**ఆదేశిక సూత్రాలను పౌరులు సాధించుకోవడానికి ఆర్టికల్ 32లో భాగంగా వీటిని చేర్చడం అవసరం.**

## ఆర్టికల్ 36 - నిర్వచనం

సందర్భానుసారంగా ప్రత్యేక అర్థం ధ్వనించని యెడల స్టేట్ లేక రాజ్యం అనే పదానికి రాజ్యాంగంలోని మూడవ భాగంలో ఇవ్వబడిన నిర్వచనమే ఈ భాగానికి వర్తిస్తుంది.

## ఆర్టికల్ 37

ఈ విభాగంలోని ఆదేశిక సూత్రాలను అమలు చేయవలసిందిగా ఏ న్యాయస్థానం ఉత్తర్వులను జారీ చేయరాదు. అయితే చట్టాలను రూపొందిం చుటలో ప్రభుత్వాలు తప్పనిసరిగా ఆదేశిక సూత్రాలను పరిగణనలోనికి తీసుకోవలెను. పరిపాలన చేయుటలో ప్రభుత్వాలు, ఆదేశిక సూత్రాలను తప్పనిసరిగా ప్రామాణికాలుగా తీసుకోవలెను.

ఈ పార్టులోని సూత్రాలను ఏ కోర్టు తనంతట తానుగా అమలు పరచలేదు. అయితే సూత్రాలు అన్నీ ప్రభుత్వ నిర్వహణలో ఇక్కడి సూత్రాలను ప్రాథమికమైనట్లూ, ప్రధానమైనట్లూ పరిగణించవలసిన బాధ్యత రాజ్యంపై ఉ న్నది. ఈ సూత్రాలను అవసరమైన అన్ని శాసనాలలోనూ ప్రభావితపరచు బాధ్యత కూడా రాజ్యంపై ఉన్నట్లు భావించవలెను. ఆర్టికల్ 37 ద్వారా ఆదేశిక సూత్రాలను అమలు జరుపుతుంది.

## ఆర్టికల్ 38: ప్రజా సంక్షేమానికి అనుగుణమైన సామాజిక వ్యవస్థ ఉండాలి

1) జాతీయ జీవనంలో అందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందేందుకు తగిన సామాజిక వ్యవస్థను నెలకొల్పేందుకు, తద్వారా ప్రజా సంక్షేమానికి అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం తప్పనిసరిగా కృషి చేయాలి.

2) ప్రత్యేకించి ఆర్థిక అసమానతలను సాధ్యమైనంత మేర తగ్గించేందుకు ప్రభుత్వం కృషిచేయాలి. అంతేకాకుండా ప్రజల మధ్య హెూదా, సౌకర్యాలు, అవకాశా లలోగల తారతమ్యాలను తొలగించేందుకు ప్రయత్నించడమే కాకుండా, విభిన్న ప్రాంతాలలో, లేక విభిన్న వృత్తులలోగల ప్రజల మధ్య హెూదా, సౌకర్యాలు, అవకాశాలలోగల తారతమ్యాలను తొలగించేందుకు ప్రయత్నించాలి.

(తొలుత ఈ ఆర్టికల్ రూపొందించబడినప్పుడు రెండవ పేరాగ్రాఫ్ లేదు. 1979లో జరిగిన 44వ రాజ్యాంగ సవరణ ద్వారా రెండవ పేరాగ్రాఫ్ చేర్చబడినందు వలన మొదటి పేరాగ్రాఫ్‌ను క్లాజు (1) గాను రెండవ పేరాగ్రాఫ్‌ను క్లాజు (2)గాను సూచించటం జరిగింది).

## ఆర్టికల్స్: 39 & 39ఎ

## ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొనవలసిన కొన్ని ఆదేశిక సూత్రాలు:

ప్రభుత్వం తన విధాన రూప కల్పనలో ఈ క్రింది మార్గ దర్శక ఆదేశిక సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి.

ఎ) తగిన జీవనాధారాన్ని ఎంపిక చేసుకొనుటలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు ఉండాలి.

బి) సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, అందుబాటులో ఉన్న సహజ వనరులపై యాజమాన్యం, నియంత్రణ, సమాజంలో అందరికీ వాటిని సమానంగా పంపిణీ చేయుట.

సి) ఉత్పత్తి పరికరాలు, సంపద కేవలం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమై, సామాన్యుల ప్రయోజనాలకు భంగం కలగని విధంగా ఆర్థిక విధాన రూపలకల్పన.

డి) స్త్రీ, పురుషులందరికీ సమానమైన ఉద్యోగాలలో సమానమైన వేతన సిద్ధాంతాన్ని అమలు చేయుట.

ఇ) స్త్రీ మరియు పురుష కార్మికుల శ్రమశక్తి, ఆరోగ్యం, బాల్యావస్థలో ఉన్న బాల కార్మికుల ఆరోగ్యం, శ్రమశక్తి దుర్వినియోగం (దోపిడీ) కాకుండుట, ఆర్థిక పరిస్థితులవలన గత్యంతరం లేని పరిస్థితులలో వారు తమ వయస్సు, శక్తికి మించిన పనులు చేయవలసిన పరిస్థితులను నివారించుట.

ఎఫ్) స్వేచ్ఛాయుతమైన, గౌరవప్రదమైన పరిస్థితుల ప్రభావంతో ఆరోగ్యకరమైన పద్ధతిలో పిల్లల అభివృద్ధికి తగిన అవకాశాలను, సౌకర్యాలను కల్పించటం, బాల్యం, యవ్వనం కూడా దోపిడీకి గురి కాకుండా చూడటం. (1977లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజు సవరించబడింది. పరిధి విస్తృతం చేయబడింది).

### పరిపాలనా విధానంలో రాజ్యం అనుసరించవలసిన సూత్రాలు

రాజ్య పరిపాలనా విధానం ఈ క్రింది ఆశయాలకు కట్టుబడి ఉండాలి.

ఎ) పౌరులందరికి స్త్రీ, పురుషులకు సమాన జీవనోపాధి కల్పించాలి.

బి) దేశ వనరులు, వాటి పంపిణి మరియు యాజమాన్యం యావత్ సమాజ ఔన్నతికి దోహదపడే విధంగా ఉండాలి.

సి) ఆర్థిక విధానం ఆచరణలో ఉత్పాదక వనరులు ఏ ఒక్కరిలోనూ లేక కొద్దిమందిలోనూ కేంద్రీకృతం అవ్వకుండా చూడ్డం. మరియు పరిపాలనా ఉత్పాదక వనరులు కేంద్రీకృతం కావడంవల్ల ఉత్పన్నమయ్యే హాని నుండి సమాజాన్ని రక్షించడం.

## ఆర్టికల్ 39ఏ: ఉచిత న్యాయ సహాయం

న్యాయ వ్యవస్థ ద్వారా న్యాయం జరిగేటట్లు చూడటానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. న్యాయ సహాయం అందరికీ అందుబాటులోకి రావాలి. ఆర్థిక దుస్థితి వలనగాని, లేక మరేదైనా ఇతర కారణం వలనగాని న్యాయాన్ని పొందే అవకాశం కొందరికి లేకుండా పోయే పరిస్తితి ఉండకూడదు. ఈ పరిస్థితిని నివారించేందుకు అటువంటి వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించటానికి తగిన శాసనాలను, ఇతర పథకాలను ప్రభుత్వాలు రూపొందించాలి. (1977లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ అధికరణం అదనంగా చేర్చబడింది).

## సమాన న్యాయం, న్యాయ సహాయం

న్యాయవ్యవస్థ ప్రజలందరికి అందుబాటులో ఉండవలెను. ఆర్థికంగా కోర్టులను ఆశ్రయించే శక్తి, సామర్థ్యత లేనివారికి తగు న్యాయ సహాయం అందజేసే నిమిత్తం చట్టముల ద్వారా లేక ఇతరత్రా సంస్థలను ఏర్పరచవలెను.

ఆర్టికల్ 39(ఎ)ద్వారా సమాన న్యాయం, ఉచిత న్యాయ సహాయం అందిస్తుంది.

## ఆర్టికల్ 40: గ్రామ స్వపరిపాలన – పంచాయితీలు

గ్రామ పంచాయితీల రూపకల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలి. వాటికి తగిన ఆలంబనను కల్పించి స్వయం పరిపాలనా యూనిట్లుగా రూపుదిద్దాలి.

## ఆర్టికల్ 41: వృద్ధులు, అశక్తులు మొదలైనవారికి తగు సహాయం అందజేయాలి:

నిరుద్యోగం, వృద్ధాప్యం, అనారోగ్యం అంగవైకల్యం వంటి అశక్తతలతో బాధపడే వారికి తగు ఆరోగ్య విద్యా సదుపాయాలను కల్పించేందుకు, తనకున్న ఆర్థిక వనరులకు లోబడి ఆర్థిక సహాయం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

## ఆర్టికల్ 42: పనిచేసే ప్రదేశాలలో మానవీయత, ప్రసూతి సౌకర్యాలు

ఉద్యోగులు లేక కార్మికులు పనిచేసేందుకు తగిన పరిస్థితులను కల్పించటం, ప్రసూతి సౌకర్యాలను కల్పించటం ప్రభుత్వ బాధ్యత.

## పనిని కలిగి ఉండే హక్కు, చదువుకునే హక్కు, నిస్సహాయులకు ఆర్థిక సహాయం

శక్తి ఉన్నంత మేరకు రాజ్యం ప్రజలందరికీ పనిని కల్పించాలి. విద్యావకాశాలను కల్పించాలి. ఉద్యోగం లేనివారికి, వయసు మీరినవారికి, అనారోగ్య బాధితులకు ఇతరత్రా శక్తిలేని నిస్సహాయులకు ఆర్థిక సహాయం అందించాలి.

## అంగవికలులకు, వృద్ధులకు రక్షణలు, పనిహక్కు కల్పించబడ్డాయి.

1950, జనవరి 26వ తేదీ నుండి అమల్లోకి వస్తున్న డా॥ బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగం గురించి కొన్ని హెచ్చరికలు చేస్తూ దాని విశిష్టతను ఇలా చెప్పారు. నేటి నుండి భారత ప్రజలు రాజకీయ రంగంలో సమాన హక్కులు పొందుతారు. అయితే సామాజిక, ఆర్థిక రంగాల్లో అసమానతలు అలాగే వున్నాయి. రాజకీయ సమానత్వంతో సామాజిక, రాజకీయ రంగాల్లో సమానత్వాన్ని సామాజిక న్యాయాన్ని సాధించడం కోసమే ఈ రాజ్యాంగం. అందుకే అంబేద్కర్ అబ్రహం లింకన్ ప్రజాస్వామ్యానికిచ్చిన ప్రజలకొరకు, ప్రజల చేత, ప్రజల యొక్క అనే నిర్వచనాన్ని విభేదిస్తూ మరింత వున్నతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. సామాజిక న్యాయాన్ని సాధించడమే ప్రజాస్వామ్యం అని ఉదాత్రీకరించారు.

## సమాన న్యాయం, న్యాయ సహాయం

న్యాయవ్యవస్థ ప్రజలందరికి అందుబాటులో ఉండాలి. ఆర్థికంగా కోర్టులను ఆశ్రయించే శక్తి, సామర్థ్యత లేనివారికి తగు న్యాయ సహాయం అందజేసే నిమిత్తం చట్టాల ద్వారా లేక ఇతరత్రా సంస్థలను ఏర్పరచాలి.

ఆర్టికల్ 41 ద్వారా పనిచేసే హక్కు, విద్యను పొందే హక్కు, ప్రజలు సహాయం పొందే హక్కు. ఆర్టికల్ 41 ద్వారా అంగవికలులకు, వృద్ధులకు రక్షణలు, పనిహక్కు కల్పించాయి.?

## ఆర్టికల్ 43: పనివారికి జీవనభృతి తప్పనిసరి

పనిచేయు వారందరికి వ్యవసాయ కూలీలతో సహా జీవిత ప్రమాణానికి సరిపోవు వేతనములు ఉండవలెను. వీరందరికి ఆట పాటలోనూ, సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ పాల్గొను అవకాశములను కల్పించవలెను. ప్రోత్సాహక చర్యలను చేపట్టవలెను. గ్రామీణ ప్రాంతాలలో చేతి వృత్తులను ప్రోత్సహించుటయే గాక వారిలో సహకారం పెంపొందించే నిమిత్తం సహకార సంస్థలను ఏర్పరచవలెను.

## ఆర్టికల్ 43ఎ: ఫ్యాక్టరీ నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం

42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా ఈ ఆర్టికల్ చేర్చడం జరిగింది. ఈ ఆర్టికల్ ఈ విధంగా పేర్కొంటుంది.

"పారిశ్రామిక రంగానికి చెందిన ఫ్యాక్టరీలు, వ్యవస్థాపనలు మొదలైనవాటి నిర్వహణలలో భాగస్వాములను చేసేందుకు తగిన శాసనాలను రాజ్యం రూపొందించాలి.

## ఆర్టికల్ 43బి: సహకార సంస్థలకు ప్రోత్సాహం

సహకార సంస్థల వృత్తిపర యాజమాన్యం, స్వచ్ఛందంగా వ్యవహరించడం, స్వేచ్ఛగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.

## ఆర్టికల్ 44: ఉమ్మడి పౌరస్మృతి

"భారతదేశంలోని పౌరులందరికి ఉమ్మడి పౌరస్మృతిని రూపొందించేందుకు రాజ్యాం కృషి చేయాలి" అని ఈ ఆర్టికల్ పేర్కొంటుంది. ఉమ్మడి పౌరస్మృతి (Uniform Civil Code or Common Civil Code) అనగా పౌరుల చట్టాలని అన్నిటినీ సార్వత్రికంగా క్రోడీకరించి ఒకే చట్టంగా రూపొందించిన చట్టం అని అర్థం. వివిధ మతాలకు చెందిన ప్రజల మధ్య ఐక్యతను, సమగ్రతను తేవడం దీని యొక్క ప్రధాన లక్ష్యం. ఇటువంటి స్మృతి ఉండాలని 1937లో అఖిల భారత మహిళా సమావేశంలో సభ్యులు మొట్టమొదట కోరడం జరిగింది. స్త్రీల పట్ల వివిధ మతాల వ్యక్తిపర శాసనాలు (Personel Laws) వివక్షను చూపుతున్నాయని, కనుక ఇటువంటి వివక్షత ఉన్న వ్యక్తిపర శాసనాంశాలని తొలగించి, అన్నిటి వ్యక్తిగత శాసనాలలోని మంచి అంశాలతో పౌరులందరూ ఐక్యతతో ఉండేవిధంగా ఒకే రకంగా ఉండే స్మృతిని అనగా ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల అధ్యాయంలో చేర్చాలని ఈ మహిళా సమావేశం రాజ్యాంగ పరిషత్ సభ్యులను కోరింది. రాజ్యాంగ పరిషత్ దీనికి స్పందించి దీనిని సమావేశాలలో చర్చించింది. కానీ, పరిషత్‌లో ఏకాభిప్రాయం కుదరని కారణంగా, ఈ విషయాన్ని రాజ్యాంగం లోని నాల్గవ భాగంలో ఆదేశిక సూత్రాలలో చేర్చింది. దీనికి కూడా కొంతమంది ముస్లిం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసారు. కానీ డా॥ బి.ఆర్. అంబేద్కర్ పరిషత్‌లోని సభ్యులందరినీ సమాధాన పరిచారు. ఈ ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం ఆదేశిక సూత్రాలలో ఉన్నది కనుక రానున్న కాలంలో అందరి ఆమోదంతో ఒక క్రమ పద్ధతిలో ఈ స్మృతి రాజ్యం చేయవచ్చునని చెప్పారు. 23 నవంబర్,

1948 నాడు ఈ సమావేశం జరిగింది. ఆర్టికల్ 44లో ఉన్న పదాలను గమనిస్తే, రాజ్యం ఈ స్మృతి కోసం 'కృషి' చేయాలని ఉంది.

## ఆర్టికల్ 45: ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న బాల బాలికలకు పూర్వ బాల్యావస్థ సంరక్షణ

86వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002 ద్వారా 21ఎ ఆర్టికల్ ప్రకారం విద్యా హక్కుని గుర్తించాలని మనం తెలుసుకున్నాం. దీని ప్రకారం "ఆరు సంవత్సరముల నుండి 14 సంవత్సరములలోపు పిల్లలందరికీ నిర్బంధ ఉచిత విద్యను నేర్పటం ప్రభుత్వ భాద్యత. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం రూపొందించుకోవాలి". ఈ ఆర్టికల్ ప్రాథమిక హక్కుల అధ్యాయంలో ఉంది. కనుక ఇది "న్యాయ నిర్ణేతకమైనది" అని చెప్పవచ్చును. ఇక్కడ మనం ఒక సంగతి గమనించాలి. 86వ రాజ్యాంగ సవరణ చట్టం ఏర్పడకముందు 45వ ప్రకరణ ఈ క్రింది విధంగా ఉండేది. **"14 సంవత్సరాల లోపు బాలబాలికలకు రాజ్యం ఉచిత నిర్బంధ విద్యను కలిగించాలి"**

86వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002 దీనిని రెండు భాగాలు విభజించింది. ఆరు నుండి పదునాలుగు సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను రాజ్యం ఇవ్వాలని ఈ సవరణ 21ఎలో ఏర్పరిచింది. అనగా దీనిని విద్యాహక్కుగా గుర్తించి ప్రాథమిక హక్కుల భాగంలో ఏర్పరిచింది. ప్రస్తుతం ఉన్న 45వ ప్రకరణ ప్రకారం ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలకు రాజ్యం బాల్యావస్థ సంరక్షణ కలిగించాలని ఆదేశిస్తుంది. ఇది ఆదేశ సూత్రాలలో ఉంది కనుక ఇది న్యాయ నిర్ణేతకం కాదు. ఈ విధంగా 86వ రాజ్యాంగ సవరణ కన్నా ముందున్న 45వ ప్రకరణ రెండుగా విభజింపబడిందని గ్రహించాలి. ఒకటి – ప్రాథమిక హక్కులలో 21ఎ ప్రకారం రెండు (ఆదేశిక సూత్రాలలో ఆర్టికల్ 45).

మొత్తం మీద ప్రస్తుతం 45వ ఆర్టికల్ ప్రకారం "ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న బాల బాలికలకు పూర్వ బాల్యావస్థ సంరక్షణను రాజ్యం కలగజేయాలి"

ప్రస్తుత 45వ ప్రకరణ ప్రకారం – బాల్యావస్థ వికాసానికి రాజ్యం తన కృషిలో బాల్యదశ సంరక్షణ, ఆటపాటలు, ఫ్రీనర్సరీ డేకేర్ సెంటర్ మొదలగు వాటి ద్వారా విద్యాభోదన కలిగించాలి అని తెలుసుకోవచ్చును.

బాలల క్షేమం కోసం 86వ రాజ్యాంగ సవరణ 51ఎ, కెలో తల్లిదండ్రులకు రక్షణా భాధ్యతను కూడా ఇచ్చింది.

## ఆర్టికల్ 46: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనకబడిన వర్గాల విద్యా విషయిక ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించుట

షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, వెనకబడిన తరగతుల వారికి విద్యా పరమైన, సామాజిక పరమైన, ఆర్థిక పరమైన ప్రయోజనాలను అభివృద్ధి పరచడానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సామాజిక అన్యాయం, అన్నిరకాల దోపిడీలనుండి వారిని రక్షించాలి.

## ఆర్టికల్ 47: పౌష్టిక ఆహారం, జీవన ప్రమాణాల స్థాయి పెంచడం, ప్రజారోగ్యం మెరుగు పరచడం ప్రభుత్వ కర్తవ్యం.

ప్రభుత్వం ప్రజల పౌష్టిక ఆహార స్థాయిని, జీవన ప్రమాణాల స్థాయిని పెంపొందించుట, ప్రజారోగ్యం మెరుగు పరచుట తన ప్రాథమిక కర్తవ్యంగా పరిగణించాలి. ఆరోగ్యానికి బంగం కలిగించే మత్తు పానీయాలు, ఇతర మాదక ద్రవ్యాలు, వైద్య ప్రయోజనాలకు తప్ప వేరేవిధంగా ప్రజలు సేవించకుండా చూడాలి.

## ఆర్టికల్ 48: వ్యవసాయం, పశు సంవర్ధన వ్యవస్థీకరణ

ప్రభుత్వం ఆధునిక శాస్త్రీయ పద్ధతులను అనుసరించి వ్యవసాయం, పశు సంపద వ్యవస్థీకరించడానికి కృషి చేయాలి. ముఖ్యంగా ఆవులు, దూడలు, బర్రెలు, ఇతర పాడి పశువులు రవాణాకు ఉపయోగించే పశువులను కాపాడేందుకు, వాటిని అభివృద్ధి పరిచేందుకు, వాటిని వధను నిషేధించేందుకు కృషి చేయాలి.

## ఆర్టికల్ 48ఎ: పరిసరాల రక్షణ మరియు అభివృద్ధి, అడవులు మరియు వన్యప్రాణుల సంరక్షణ:

ప్రభుత్వం దేశంలోని పరిసరాలను రక్షించి, అభివృద్ధి పరచడానికీ అడవులు, వన్యప్రాణులను పరిరక్షించడానికి ప్రయత్నించాలి. ప్రకృతి, పరిసరాలు, వన్యమృగాల, పక్షుల సంరక్షణ చేయాలి.

## ఆర్టికల్ 49: జాతీయ ప్రాముఖ్యత గల స్మారక చిహ్నాలు, స్థలాలు, వస్తువులను రక్షించుట

ప్రభుత్వం పార్లమెంట్ చేయు శాసనం ద్వారా లేదా శాసనం కింద జాతీయ ప్రాముఖ్యత గలవని ప్రకటించిన కళాత్మక, చారిత్రక ప్రయోజనం గల ప్రతి స్మారక చిహ్నం, స్థలం లేదా వస్తువులను సంరక్షించాలి. పురావస్తువులను ఇతర స్తిర, చర వస్తు సంపదను సంరక్షించాలి. వాటిని వేటిని చెరుపుట, వికారము చేయుట, నాశనం చేయుట, ధ్వంసం చేయుట, అమ్ముట, కొనుట, తరలించుట, ఎగుమతి చేయుట వంటివి జరగకుండా చూడాలి.

## ఆర్టికల్ 50: న్యాయశాఖను పరిపాలనా శాఖనుంచి వేరు చేయుట

న్యాయశాఖను పరిపాలనా శాఖనుండి వేరుచేయుటకు రాజ్యం చర్యలను చేపట్టాలె.

## ఆర్టికల్ 51: అంతర్జాతీయ శాంతి గురించి

## ఆర్టికల్ 51ఎ పార్ట్ 4ఎ – పౌరుల ప్రాథమిక కర్తవ్యాలు

ప్రతిపౌరుడు ఈ క్రింది కర్తవ్యాలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి.

ఎ) రాజ్యాంగానికి బద్దుడై ఉండాలి. చట్టాలు, వాటి ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని అంకిత భావంతో గౌరవిచాలి.

బి) జాతీయ, స్వాతంత్ర్య పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన ఉన్నత ఆదర్శాలను మనసులో ఉంచుకొని వాటిని ఆచరించాలి.

సి) భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతను సమర్థిస్తూ సంరక్షించాలి.

డి) దేశాన్ని రక్షించుట. కోరినప్పుడు జాతీకి సేవ చేయాలి.

ఇ) భారత ప్రజల మధ్య మత, భాష, ప్రాంతీయ వర్గ, వైవిధ్యాలను అధిగమించి సామరస్యాన్ని, సోదర భావాన్ని పెంపొందించే కృషి చేయాలి. స్త్రీలను అగౌరవపరచే ఆచారాలను విడనాడాలి.

ఎఫ్) మన ఉమ్మడి సంస్కృతిని సుసంపన్న సంప్రదాయాలను గౌరవించి రక్షించాలి.

జి) అడవులు, సరస్సులు, నదులు, పర్యావరణం, చెరువులను రక్షించుట,

అడివి జంతువులతో సహా ప్రకృతి పరిసరాలను కాపాడి అభివృద్ధి చేయాలి. సమస్థ జీవుల యెడల కరుణార్ధ్రత కలిగి ఉండాలి.

హెచ్) వైజ్ఞానిక, శాస్త్రీయ మానవతా దృక్పథాలను అలవరుచుకుంటూ, జిజ్ఞాసను సంస్కరణ తత్వాన్ని పెంపొందించుకోవాలి.

ఐ) ప్రజల ఆస్తులను సంరక్షించాలి. హింసను విడనాడాలి.

జె) వ్యకిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా, సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుట కొరకు, శిఖరాగ్ర సాధన కొరకు నిరంతరం కృషి చేయాలి.

కె) బాలబాలికలకు తండ్రి, తల్లి, లేదా రక్షకులు లేదా సంరక్షులుగా ఉన్నవారందరు 6 నుంచి 14 సంవత్సరాల విద్యాభ్యాసం చేయు అవకాశం కల్పించాలె.

## (భారత రాజ్యాంగం పార్ట్ - 5 - చాప్టర్ 1 యూనియన్ కార్య నిర్వహణకు సంబంధించినవి)

# భారత రాజ్యాంగం పార్ట్ - 16 కొన్ని వర్గాలవారికి ప్రత్యేక అవకాశాలు

### ఆర్టికల్ 330: షెడ్యూల్ కులాలకు లోక్‌సభల రిజర్వేషన్లు

ఆర్టికల్ 330 ద్వారా ఆయా సామాజిక వర్గాలైన ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రక్షణలు కల్పించబడ్డాయి. Reservation of seats for Scheduled Castes and Scheduled Tribes in the House of the Poeple.

### లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికి స్థానాల కేటాయింపు

1. లోక్‌సభ సభ్యత్వములో ఈ క్రింద తరగతుల వారికి స్థానములను రిజర్వు చేయాలె.

ఎ) షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు (అస్సాంలోని అటానమస్ జిల్లాలలోని షెడ్యూల్డ్ తెగలు మినహా)

బి) అస్సాం అటానమస్ జిల్లాలోని షెడ్యూల్ తెగలకు

2. షెడ్యూల్డ్ కులాలకు షెడ్యూల్డ్ తెగలకు రిజర్వు చేయు స్థానములు ఆ రాష్ట్రము లేక యూనియన్ టెరిటరీల శాసనసభ సభ్యలలో, ఆ రాష్ట్ర ప్రజల జనసంఖ్య యందు షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగల జనసంఖ్యకు ఉండు నిష్పత్తిలో ఉండవలెను.

3. క్లాజు (2)లో ఏ విధంగా ఉన్నా అస్సాం అటానమస్ జిల్లాలకు లోక్‌సభలో కేటాయించే స్థానాలు అస్సాం రాష్ట్రానికి కేటాయించిన సభ్యులలో ఆ రాష్ట్ర ప్రజల జనసంఖ్యలో అటానమస్ జిల్లాల జనసంఖ్యకు ఉండు నిష్పత్తిలో ఉండాలె.

## ఆర్టికల్ 331: ఆంగ్లో ఇండియన్లకు లోక్‌సభలో రిజర్వేషన్లు

81వ ఆర్టికల్‌లో ఏమి పేర్కొన్నప్పటికీ లోక్‌సభలో ఆంగ్లో ఇండియన్లకు ప్రాతినిధ్యం లేదని, రాష్ట్రపతి భావించి నట్లయితే ఆ కమ్యూనిటీనుండి ఇద్దరికి తగ్గకుండ సభ్యులను నామినేట్ చేయవచ్చు.

## ఆర్టికల్ 332

ఆర్టికల్ 332 ద్వారా రాష్ట్ర శాసనసభల్లో షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

## ఆర్టికల్ 333: ఆంగ్లో ఇండియన్లకు రాష్ట్ర అసెంబ్లీలో సీట్ల రిజర్వేషన్లు

## ఆర్టికల్ 334

ఎ) ఎస్సీ, ఎస్టీ లకు చెందిన వారికి శాసనసభ, లోక్‌సభలలో గల సీట్ల రిజర్వేషన్.

బి) ఆంగ్లో ఇండియన్ల సీట్ల రిజర్వేషన్ 70 ఏళ్ళ తర్వాత రద్దు అవుతాయి.

## ఆర్టికల్ 335: ఉద్యోగాలలో రిజర్వేషన్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలో నియామకాల విషయంలో షెడ్యూల్డు కులాలు, తెగల వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలి. ఆ సందర్భంలో పరిపాలనా యంత్రాంగం యొక్క సమర్ధవంతమైన నిర్వహణను కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

అయితే ఈ ఆర్టికల్‌లో ఏమి పేర్కొనబడినప్పటికి, కేంద్ర ప్రభుత్వ లేక రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలోని కొన్ని తరగతుల సర్వీసులు లేక ఉద్యోగాల విషయంలో

పదోన్నతి కల్పించుటకు నిర్వహించు పరీక్షలలో షెడ్యూల్డు కులాలు, తెగల వారికి సంబంధించి అటువంటి పరీక్షలో పదోన్నతికి అవసరమైన కనీస మార్కులను ప్రభుత్వం తగ్గించవచ్చు. లేదా ప్రమాణాలను తగ్గించవచ్చు. (82వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రొవిజో చేర్చబడింది. 8-9-2000 నుండి ఈ సవరణ అమలులోనికి వచ్చింది).

## ఆర్టికల్ 336: ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆంగ్లో ఇండియన్ల రిజర్వేషన్లు

## ఆర్టికల్ 337: ఆంగ్లో ఇండియన్ల సంక్షేమానికై విద్యాపరమైన గ్రాంటు

## ఆర్టికల్ 338: షెడ్యూల్డు కులాల జాతీయ కమిషన్

**పరిచయం:**

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ మొదట ఒకటవ షెడ్యూల్ ఎ లేక బిలో చేర్చబడింది. 1956లో చేసిన ఏడవ రాజ్యాంగ సవరణతో 29వ సెక్షన్ 1-11-1956 నుండి తొలగించబడింది. రాష్ట్రాల పునర్విభజనకోసం ఏర్పాటు చేసిన ఫజుల్ అలీ కమిషన్ సిఫారసులను అనుసరించి 565 సంస్థానాలు, బ్రిటీష్ ప్రావిన్స్‌లు అన్నిటిని కలిపి 14 రాష్ట్రాలుగా రాష్ట్రాల పునర్విభజన చేసి, 1 నవంబర్ 1956 నుండి అమలులోకి తేవడం జరిగింది. అందువల్ల గతంలోని రాష్ట్రాలకు సంబంధించిన పార్ట్-ఎ, పార్ట్-బి అనే పదాల అవసరం తీరిపోయి తొలగించడం జరిగింది.

2003లో చేసిన 89వ రాజ్యాంగ సవరణ ద్వారా సెక్షన్ 2ఎ, 1990లో చేసిన 65వ రాజ్యాంగ సవరణ సెక్షన్2ఎ ద్వారా ఈ షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ ఆర్టికల్‌లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల గురించి పేర్కొనడం జరిగింది. 65వ రాజ్యాంగ సవరణ ద్వారా సెక్షన్ 2బి క్లాజు1, క్లాజు2 సవరించబడి అందులోని నాల్గవ ఆర్టికల్‌ను ప్రస్తుతమున్నవిధంగా నాల్గవ, ఐదవ ఆర్టికల్స్‌ను మార్పు చేయడం జరిగింది. 89వ రాజ్యాంగ సవరణ ద్వారా షెడ్యూల్డ్ ట్రైబ్స్ అనే పదాన్ని 19-2-2004 నుండి తొలగించడం జరిగింది. షెడ్యూల్స్ ట్రైబ్స్ కోసం 338ఎ అనే ఆర్టికల్‌ను చేర్చడం జరిగింది. 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా వెనుకబడిన తరగతులకోసం 338బి అనే ఆర్టికల్స్‌ను ప్రత్యేకంగా రాజ్యాంగ సవరణలో చేర్చడం జరిగింది. అందువల్ల 338 ఆర్టికల్ షెడ్యూల్డ్ కులాలకు ప్రత్యేకంగా కొనసాగుతుంది.

1) షెడ్యూల్డు కులాల కోసం ఒక షెడ్యూల్డు కులాల జాతీయ కమిషన్ ఉండాలి. అది 'షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ అని/నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్' అని పిలువబడుతుంది.

2) పార్లమెంటు రూపొందించే విధివిధానాలను అనుసరించి షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్‌కు ఒక ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ముగ్గురు సభ్యులుంటారు. వారి పదవీ కాలం, కర్తవ్యాలు, అధికారాలు తదితరాలను రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు.

3) కమిషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఇతర సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు.

4) కమిషన్ తన విధివిధానాలను, కర్తవ్యాలను తనకు తాను నిర్ణయించుకునే అధికారం కలిగి ఉంటుంది.

5) ఎ) షెడ్యూల్డ్ కులాలకు కల్పించిన రక్షణలకు సంబంధించిన అన్ని విషయాలను పర్యవేక్షించాలి. పరిశోధించాలి.

బి) రాజ్యాంగ పరిధిలో అమలులో ఉన్న చట్టాలను అనుసరించి, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎప్పటికప్పుడు హక్కుల ఉల్లంఘనను శోధించాలి. ఆయా రక్షణలను పరిశీలించాలి. షెడ్యూల్డ్ కులాల రక్షణలు, హక్కులకు సంబంధించిన నిర్దిష్టమైన ఫిర్యాదుల గురించి విచారణ చేపట్టాలి.

సి) సామాజిక, ఆర్థిక, అభివృద్ధి గురించి, ప్రణాళికల గురించి సూచనలు, సిఫారసులు చేయడంలో చురుకుగా పాల్గొనాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వారి అభివృద్ధి వికాసాల గురించి సమీక్షిస్తూ తగు సూచనలు సిపారసులు చేస్తుండాలి.

డి) భారత రాష్ట్రపతికి ప్రతి సంవత్సరం ఎస్సీలకోసం ప్రవేశపెట్టిన రక్షణ అమలు తీరుగురించిన కమిషన్ తన నివేదికలను ఆ యేడాదిలో చేసిన పరిశీలన, శోధన, పరిశోధన, కార్యకలాపాలు, సూచనలు, సిఫారసులు గురించి నివేదిక అందజేయాలి.

ఇ) కమిషన్ తన సిఫారసులు, నివేదికలు రూపొందించాలి. వాటిని పకడ్బంధీగా అమలు జరుపుటకు చర్యలు, రక్షణలు, ప్రమాణాలు సామాజిక, ఆర్థిక, అభివృద్ధి, సంక్షేమం గురించి నివేదికలలో పొందుపరచాలి. మరియు

ఎఫ్) షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, సంక్షేమం, అడ్వాన్స్‌మెంట్‌కు సంబంధించి రాష్ట్రపతిచే పార్లమెంటు ద్వారా ప్రత్యేకంగా కోరిన అంశాలను అనుసరించి ఆయా విధులను జాతీయ కమిషన్ నిర్వర్తించాలి.

6) రాష్ట్రపతి కమిషన్ యొక్క నివేధికలను పార్లమెంట్ ముందు వాటిని వివరిస్తూ చర్య తీసుకోవడానికి పార్లమెంటు ముందు ఉంచుతారు. యూనియన్ ప్రభుత్వంకు సంబంధించిన సిఫారసులను చట్టబద్ధం చేయడానికి రాష్ట్రపతి ప్రతిపాదనలతో, అభిప్రాయాలను జోడించి పార్లమెంటు ముందుంచుతారు.

7) ఏదైనా కమిషన్ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవి ఉన్నప్పుడు ఆ నివేదిక కాపీని ఆ రాష్ట్ర గవర్నర్‌కు పంపించబడుతుంది. గవర్నర్ అట్టిదానిని రాష్ట్ర శాసనసభకు తన అభిప్రాయాలతో, వివరణలతో అందజేసి ఆ సిఫారసులను అమలు చేయడానికి చర్చించి తగు చట్టాలు, కార్యక్రమాలు రూపొందించాలని కోరతారు. ఆమోదయోగ్యం కాని సిఫారసులు ఉంటే అందుకు గల కారణాలను పేర్కొనాలి.

8) సబ్ క్లాజ్ (ఎ)కి సంబంధించి లేక ఇతర సబ్‌క్లాజ్ (బి) 5కి సంబంధించి కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉన్న అన్ని అధికారాలు ఉంటాయి. ఈ కింది అంశాలకు సంబంధించి పూర్తి సివిల్ కోర్టు అధికారాలతో విచారణ చేపట్టాలి

ఎ) ఏ వ్యక్తినైనా, దేశంలో ఏ ప్రాంతంనుండైనా అతడు హాజరు కావాలని సమన్లు జారీ చేయడం. ప్రమాణం చేయించి ఎగ్జామినేషన్ చేయాలి;

బి) ఏ డాక్యుమెంటునైనా శోధించి అందించాలని ఆదేశించడం;

సి) అఫిడవిట్లను, సాక్ష్యాలను సేకరించడం, స్వీకరించడం;

డి) ఏ న్యాయస్థానం నుంచైనా, ఏ కార్యాలయం నుంచైనా పబ్లిక్ రికార్డ్‌లను తెప్పించుకోవడం;

ఇ) డాక్యుమెంట్లను సాక్ష్యాలు పరిశీలించడానికి ఉత్తర్వులు జారీ చేయడం. కమిషన్‌లను నియమించడం;

ఎఫ్) రాష్ట్రపతి గానీ, శాసనాలు గానీ నిర్ధేశించిన ఏ అంశాలైనా.

9) కేంద్రం, మరియు ప్రతి రాష్ట్రం, ప్రభుత్వం, కమిషన్‌ను షెడ్యూల్డ్ కులాల ముఖ్యమైన పాలసీలకు సంబంధించి సంప్రదించాలి.

10) షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ఈ ఆర్టికల్ వెనుకబడిన తరగతులకు కూడా వర్తించేట్టు రాష్ట్రపతి క్లాజు (1) ఆర్టికల్ 340 ద్వారా ఆదేశించి కోరవచ్చు.

## ఆర్టికల్ 338ఎ: షెడ్యుల్డు తెగల జాతీయ కమిషన్

### పరిచయం:

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ ఆర్టికల్ 338 సందర్భంగా పేర్కొనేవిధంగా పరిచయాన్ని, వివరణలను ఈ ఆర్టికల్‌లో కూడా అన్వయించు కోవడం అవసరం.

1) షెడ్యూల్డు తెగల కోసం ఒక షెడ్యూల్డు తెగల జాతీయ కమిషన్ ఉండాలి. అది 'షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ అని/నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్' అని పిలువబడుతుంది.

2) పార్లమెంటు రూపొందించే విధివిధానాలను అనుసరించి షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్‌కు ఒక ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ముగ్గురు సభ్యులుంటారు. వారి పదవీ కాలం, కర్తవ్యాలు, అధికారాలు తదితరాలను రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు.

3) కమిషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఇతర సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు.

4) కమిషన్ తన విధివిధానాలను, కర్తవ్యాలను తనకు తాను నిర్ణయించుకునే అధికారం కలిగి ఉంటుంది.

5) ఎ) షెడ్యూల్డ్ తెగలకు కల్పించిన రక్షణలకు సంబంధించిన అన్ని విషయాలను పర్యవేక్షించాలి. పరిశోధించాలి.

బి) రాజ్యాంగ పరిధిలో అమలులో ఉన్న చట్టాలను అనుసరించి, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎప్పటికప్పుడు హక్కుల ఉల్లంఘనను శోధించాలి. ఆయా రక్షణలను పరిశీలించాలి. షెడ్యూల్డ్ తెగల రక్షణలు, హక్కులకు సంబంధించిన నిర్దిష్ఠమైన ఫిర్యాదుల గురించి విచారణ చేపట్టాలి.

సి) సామాజిక, ఆర్థిక, అభివృద్ధి గురించి, ప్రణాళికల గురించి సూచనలు, సిఫారసులు చేయడంలో చురుకుగా పాల్గొనాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వారి అభివృద్ధి వికాసాల గురించి సమీక్షిస్తూ తగు సూచనలు సిపారసులు చేస్తుండాలి.

డి) భారత రాష్ట్రపతికి ప్రతి సంవత్సరం షెడ్యూల్డ్ తెగల కోసం ప్రవేశపెట్టిన రక్షణ అమలు తీరుగురించిన కమిషన్ తన నివేదికలను ఆ యేడాదిలో చేసిన పరిశీలన, శోధన, పరిశోధన, కార్యకలాపాలు, సూచనలు, సిఫారసులు గురించి నివేదిక అందజేయాలి.

ఇ) కమిషన్ తన సిఫారసులు, నివేదికలు రూపొందించాలి. వాటిని పకడ్బంధీగా అమలు జరుపుటకు చర్యలు, రక్షణలు, ప్రమాణాలు సామాజిక, ఆర్థిక, అభివృద్ధి, సంక్షేమం గురించి నివేదికలలో పొందుపరచాలి. మరియు

ఎఫ్) షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి, సంక్షేమం, అడ్వాన్స్‌మెంట్‌కు సంబంధించి రాష్ట్రపతిచే పార్లమెంటు ద్వారా ప్రత్యేకంగా కోరిన అంశాలను అనుసరించి ఆయా విధులను జాతీయ కమిషన్ నిర్వర్తించాలి.

6) రాష్ట్రపతి కమిషన్ యొక్క నివేధికలను పార్లమెంట్ ముందు వాటిని వివరిస్తూ చర్య తీసుకోవడానికి పార్లమెంటు ముందు ఉంచుతారు. యూనియన్ ప్రభుత్వంకు సంబంధించిన సిఫారసులను చట్టబద్ధం చేయడానికి రాష్ట్రపతి తన ప్రతిపాదనలతో, అభిప్రాయాలను జోడించి పార్లమెంటు ముందుంచుతారు.

7) ఏదైనా కమిషన్ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవి ఉన్నప్పుడు ఆ నివేదిక కాపీని ఆ రాష్ట్ర గవర్నర్‌కు పంపించబడుతుంది. గవర్నర్ అట్టిదానిని రాష్ట్ర శాసనసభకు తన అభిప్రాయాలతో, వివరణలతో అందజేసి ఆ సిఫారసులను అమలు చేయడానికి చర్చించి తగు చట్టాలు, కార్యక్రమాలు రూపొందించాలని కోరతారు. ఆమోదయోగ్యం కాని సిఫారసులు ఉంటే అందుకు గల కారణాలను పేర్కొనాలి.

8) సబ్ క్లాజ్ (ఎ)కి సంబంధించి లేక ఇతర సబ్‌క్లాజ్ (బి) 5కి సంబంధించి కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉన్న అన్ని అధికారాలు ఉంటాయి. ఈ కింది

అంశాలకు సంబంధించి పూర్తి సివిల్ కోర్టు అధికారాలతో విచారణ చేపట్టాలి

ఎ) ఏ వ్యక్తినైనా, దేశంలో ఏ ప్రాంతంనుండైనా అతడు హాజరు కావాలని సమన్లు జారీ చేయడం. ప్రమాణం చేయించి ఎగ్జామినేషన్ చేయాలి;

బి) ఏ డాక్యుమెంటునైనా శోధించి అందించాలని ఆదేశించడం;

సి) అఫిడవిట్లను, సాక్ష్యాలను సేకరించడం, స్వీకరించడం;

డి) ఏ న్యాయస్థానం నుంచైనా, ఏ కార్యాలయం నుంచైనా పబ్లిక్ రికార్డులను తెప్పించుకోవడం;

ఇ) డాక్యుమెంట్లను సాక్ష్యాలు పరిశీలించడానికి ఉత్తర్వులు జారీ చేయడం. కమిషన్‌లను నియమించడం;

ఎఫ్) రాష్ట్రపతి గానీ, శాసనాలు గానీ నిర్ధేశించిన ఏ అంశాలైనా.

9) కేంద్రం, మరియు ప్రతి రాష్ట్రం, ప్రభుత్వం, కమిషన్‌ను షెడ్యూల్డ్ తెగల ముఖ్యమైన పాలసీలకు సంబంధించి సంప్రదించాలి.

10) షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన ఈ ఆర్టికల్ వెనుకబడిన తరగతులకు కూడా వర్తించేట్టు రాష్ట్రపతి క్లాజు (1) ఆర్టికల్ 340 ద్వారా ఆదేశించి కోరవచ్చు.

## ఆర్టికల్ 338బి: వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్

**పరిచయం:**

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ వలెనే షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ ఏర్పరచబడింది. బి.పి. మండల్ 1980లో బీసీల రక్షణలు రిజర్వేషన్లు ఉద్యోగ విద్యా, రాజకీయ, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సంక్షేమం, వికాసం కోసం చేసిన సిఫారసులు, రాజకీయ కారణాల వల్ల, ప్రభుత్వాలు మారడం వల్ల చాలాకాలం పెండింగ్‌లో ఉన్నాయి. 1951లో మద్రాసు హైకోర్టు చంపకం దొరై రాజన్ కేసులో రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో రాష్ట్రమంతటా ఆందోళనలు, ఉద్యమాలు చెలరేగాయి. దాంతో రిజర్వేషన్ల రక్షణల కోసం రాజ్యాంగం, ఆర్టికల్ 15(4), 16(4) చేర్చి 29బి ఆర్టికల్ కూడా చేర్చడం జరిగింది. అలా అనేక ఆర్టికల్స్‌లో సబ్ క్లాజులు చేర్చడం జరిగింది. ఇదంతా మొదటి రాజ్యాంగ సవరణతో

జరిగింది. 1935 నాటి రాజ్యాంగంలో 10.3 ఆర్టికల్‌లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌ల గురించి ఉన్నప్పటికీ అంబేద్కర్ ఎంత ప్రయత్నించినా 1946 భారత రాజ్యాంగ పరిషత్ చర్చించి రాజ్యాంగంలో చేర్చకుండా పక్కకు పడేసింది. ఆ తర్వాత చంపకం దొరై రాజన్ కేసుతో మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించింది. అలా మొదటి రాజ్యాంగ సవరణ చేర్చడంతోపాటు 1932 నుండి పూనా ఒప్పందంతో ఎస్సీ రిజర్వేషన్‌లవలె అమలులోకి రావలసిన బీసీ రిజర్వేషన్‌లు రాజ్యాంగంలో చేర్చబడకపోగా, రాష్ట్రాలు అమలు జరిపే ప్రయత్నం చేసే రిజర్వేషన్‌లను కొట్టివేయడంతో నాటి నెహ్రూ ప్రభుత్వం మొదటి జాతీయ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. దానికి ఛైర్మన్ అయిన కాకా సాహెబ్ కాలేల్కర్ పేరిట ఆ నివేదిక కాలేల్కర్ కమిషన్ అని ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ నివేదికలో ఓబీసీల జీవన స్థితిగతుల గురించి అధ్యయనం చేసినప్పటికీ కుల ప్రాతిపదికపై రిజర్వేషన్‌లు ఇవ్వకూడదని సిఫారసు చేయడం జరిగింది. అయితే రిజర్వేషన్‌లకు అనుకూలంగా మొత్తం నివేదిక ఉంటుంది. సిఫారసులు అకస్మాత్తుగా మారినట్టు, మార్చినట్టు కనపడతాయి. ప్రత్యేకంగా ఆనాటి ప్రభుత్వం, ప్రధానమంత్రి జోక్యం చేసుకొని ఆ సిఫారసులను తిరగ రాయించి కుల ప్రాతిపధికపై రిజర్వేషన్లు ఇవ్వకూడదు అని రాయించినట్టుగా ఓబీసీ వర్గాల సామాజిక శాస్త్రవేత్తల్లో ఒక అభిప్రాయం నెలకొని ఉంది. రాష్ట్రాల వారీగా దేశమంతటా వేర్వేరు కులాలు ఉన్నాయని, అందువల్ల ఆయా రాష్ట్రాలే బీసీ కులాలు నిర్ధారించుకొని అమలు చేసుకోవాలని కేంద్రం సూచించడం జరిగింది. దాంతో ఆయా రాష్ట్రాలు ప్రజా ఉద్యమాలను అనుసరించి బీసీ కమిషన్‌లు వేసి రిజర్వేషన్‌లను అమలు జరిపే ప్రయత్నాలు ప్రారంభించాయి.

అయితే జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల్లో, పరిశ్రమల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు లేకుండా పోయాయి. దాంతో బీసీలు అన్ని రంగాల్లో అవకాశాలు లేకపోవడంతో బాగా వెనుకబడిపోయారు. రామ్‌మనోహర్ లోహియా సోషలిస్టు పార్టీ ఓబీసీల గురించి పట్టించుకొని 60 శాతం దాకా అన్ని రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని, తమ పార్టీలో కూడా 60 శాతం ప్రాధాన్యత ఇచ్చి ఓబీసీలను చట్టసభలకు, పార్టీ నాయకత్వానికి ఎదిగించడం జరిగింది. అలా 1967 నుండి ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ఓబీసీలు ముఖ్యమంత్రులవుతూ రావడం జరిగింది. ఎమర్జెన్సీ తర్వాత కాంగ్రేసేతర పార్టీలు

ఒక్కటై జనతా పార్టీ పేరుతో 1977 ఎన్నికల్లో పోటీ చేసి అధికారంలోకి రావడం జరిగింది. ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే నిమిత్తం రెండవ జాతీయ బీసీ కమిషన్‌ను జనతాపార్టీ ప్రభుత్వం సోషలిస్టుల ఒత్తిడితో నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్, బిహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వరి ప్రసాద్ మండల్‌ను ఛైర్మన్‌గా నియమిస్తూ జాతీయ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. దేశవ్యాప్తంగా పర్యటించి వేగంగా తన నివేదికను తయారు చేసి రాష్ట్రపతికి అందించే సరికి కొద్ది రోజులు ముందే ఎన్నికలు జరిగి తిరిగి కాంగ్రెస్ తరపున ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయ్యారు. మండల్ నివేదికను ఇందిరాగాంధీ అటక ఎక్కించారు. తిరిగి జనతాదళ్ పేరుతో పాత జనతాపార్టీకి సంబంధించిన సామాజిక వర్గాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత నాటి ప్రధానమంత్రి విశ్వనాధ ప్రతాప్‌సింగ్ మండల్ కమిషన్ నివేదికను దుమ్ముదులిపి అమలు జరపడానికి పూనుకున్నారు. దీన్ని వ్యతిరేకించిన శత్రు పార్టీలు వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టారు. అప్పటికే వెలువడిన ఉత్తర్వులను న్యాయస్థానాల్లో సవాలు చేశారు. అలాంటి కేసుల్లో ఒక విద్యార్థి పైన ఇంద్ర సహాని పేరుతో మండల్ కమిషన్ నివేదిక, బీసీ, ఓబీసీ రిజర్వేషన్‌లు కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. చివరకు 1992లో సుప్రీంకోర్టు ధర్మాసనం ఓబీసీ రిజర్వేషన్‌ను అమలు జరపాలని, ఓబీసీ కులాలను నిర్ణయించడానికి ఎప్పటికప్పుడు వారి జీవన స్థితిగతులను అధ్యయనం చేయడానికి ప్రభుత్వాలకు తగు సిఫారసులు చేయడానికి మార్గదర్శకాలను తమ తీర్పు ద్వారా పేర్కొనడం జరిగింది. అప్పటినుండి జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో శాశ్వత ప్రతిపధికపై బీసీ కమిషన్‌లు ఏర్పాటు చేయబడుతూ వస్తున్నాయి.

అయితే ఇవి చట్టబద్ధమైన కమిషన్‌లుగా కొనసాగుతూ వచ్చాయి. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ద్వారా, రాజ్యాంగంలో చేర్చాల్సిన అవసరం ఉ ండింది. 123వ రాజ్యాంగ సవరణ బిల్లుతో ఇది పార్లమెంటులో ప్రవేశపెట్టబడి 102వ రాజ్యాంగ సవరణగా రాజ్యాంగంలో చేర్చబడింది. 2018 ఆగష్టు నుండి ఈ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చింది. ఈ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో అనేక ఆర్టికల్స్‌లో చిన్న చిన్న సబ్ క్లాజులను కూడా అవసరమైన మేరకు చేర్చడం జరిగింది. దాంతోపాటుగా 338 ఆర్టికల్ షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్‌కు సంబంధించిన ఆర్టికల్‌ను, షెడ్యూల్డ్ కులాల అనే స్థానంలో వెనుకబడిన తరగతులు అని చేర్చి యధాతధంగా 338బి ఆర్టికల్‌గా పొందు పరచడం జరిగింది.

1) వెనుకబడిన తరగతుల కోసం ఒక వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ ఉండాలి. అది 'వెనుకబడిన తరగతులజాతీయ కమిషన్ అని/ నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్' అని పిలువబడుతుంది.

2) పార్లమెంటు రూపొందించే విధివిధానాలను అనుసరించి వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు ఒక ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ముగ్గురు సభ్యులుంటారు. వారి పదవీ కాలం, కర్తవ్యాలు, అధికారాలు తదితరాలను రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు.

3) కమిషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఇతర సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు.

4) కమిషన్ తన విధివిధానాలను, కర్తవ్యాలను తనకు తాను నిర్ణయించుకునే అధికారం కలిగి ఉంటుంది.

5) ఎ) వెనుకబడిన తరగతులకు కల్పించిన రక్షణలకు సంబంధించిన అన్ని విషయాలను పర్యవేక్షించాలి. పరిశోధించాలి.

బి) రాజ్యాంగ పరిధిలో అమలులో ఉన్న చట్టాలను అనుసరించి, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎప్పటికప్పుడు హక్కుల ఉల్లంఘనను శోధించాలి. ఆయా రక్షణలను పరిశీలించాలి. వెనుకబడిన తరగతుల రక్షణలు, హక్కులకు సంబంధించిన నిర్దిష్ఠమైన ఫిర్యాదుల గురించి విచారణ చేపట్టాలి.

సి) సామాజిక, ఆర్థిక, అభివృద్ధి గురించి, ప్రణాళికల గురించి సూచనలు, సిఫారసులు చేయడంలో చురుకుగా పాల్గొనాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వారి అభివృద్ధి వికాసాల గురించి సమీక్షిస్తూ తగు సూచనలు సిపారసులు చేస్తుండాలి.

డి) భారత రాష్ట్రపతికి ప్రతి సంవత్సరం వెనుకబడిన తరగతుల కోసం ప్రవేశపెట్టిన రక్షణ అమలు తీరుగురించిన కమిషన్ తన నివేదికలను ఆ యేడాదిలో చేసిన పరిశీలన, శోధన, పరిశోధన, కార్యకలాపాలు, సూచనలు, సిఫారసులు గురించి నివేదిక అందజేయాలి.

ఇ) కమిషన్ తన సిఫారసులు, నివేదికలు రూపొందించాలి. వాటిని పకడ్బంధీగా అమలు జరుపుటకు చర్యలు, రక్షణలు, ప్రమాణాలు

సామాజిక, ఆర్థిక, అభివృద్ధి, సంక్షేమం గురించి నివేదికలలో పొందుపరచాలి. మరియు

ఎఫ్) వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమం, అడ్వాన్స్‌మెంట్‌కు సంబంధించి రాష్ట్రపతిచే పార్లమెంటు ద్వారా ప్రత్యేకంగా కోరిన అంశాలను అనుసరించి ఆయా విధులను జాతీయ కమిషన్ నిర్వర్తించాలి.

6) రాష్ట్రపతి కమిషన్ యొక్క నివేధికలను పార్లమెంట్ ముందు, వాటిని వివరిస్తూ చర్య తీసుకోవడానికి పార్లమెంటు ముందు ఉంచుతారు. యూనియన్ ప్రభుత్వంకు సంబంధించిన సిఫారసులను చట్టబద్ధం చేయడానికి రాష్ట్రపతి తన ప్రతిపాదనలతో, అభిప్రాయాలను జోడించి పార్లమెంటు ముందుంచుతారు.

7) ఏదైనా కమిషన్ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవి ఉన్నప్పుడు ఆ నివేదిక కాపీని ఆ రాష్ట్ర గవర్నర్‌కు పంపించబడుతుంది. గవర్నర్ అట్టిదానిని రాష్ట్ర శాసనసభకు తన అభిప్రాయాలతో, వివరణలతో అందజేసి ఆ సిఫారసులను అమలు చేయడానికి చర్చించి తగు చట్టాలు, కార్యక్రమాలు రూపొందించాలని కోరతారు. ఆమోదయోగ్యం కాని సిఫారసులు ఉంటే అందుకు గల కారణాలను పేర్కొనాలి.

8) సబ్ క్లాజ్ (ఎ)కి సంబంధించి లేక ఇతర సబ్‌క్లాజ్ (బి) 5కి సంబంధించి కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉన్న అన్ని అధికారాలు ఉంటాయి. ఈ కింది అంశాలకు సంబంధించి పూర్తి సివిల్ కోర్టు అధికారాలతో విచారణ చేపట్టాలి

ఎ) ఏ వ్యక్తినైనా, దేశంలో ఏ ప్రాంతంనుండైనా అతడు హాజరు కావాలని సమన్లు జారీ చేయడం. ప్రమాణం చేయించి ఎగ్జామినేషన్ చేయాలి;

బి) ఏ డాక్యుమెంటునైనా శోధించి అందించాలని ఆదేశించడం;

సి) అఫిడవిట్లను, సాక్ష్యాలను సేకరించడం, స్వీకరించడం;

డి) ఏ న్యాయస్థానం నుంచైనా, ఏ కార్యాలయం నుంచైనా పబ్లిక్ రికార్డ్లను తెప్పించుకోవడం;

ఇ) డాక్యుమెంట్లను సాక్ష్యాలు పరిశీలించడానికి ఉత్తర్వులు జారీ చేయడం. కమిషన్‌లను నియమించడం;

ఎఫ్) రాష్ట్రపతి గానీ, శాసనాలు గానీ నిర్ధేశించిన ఏ అంశాలైనా.

9) కేంద్రం, మరియు ప్రతి రాష్ట్రం, ప్రభుత్వం, కమిషన్‌ను వెనుకబడిన తరగతుల ముఖ్యమైన పాలసీలకు సంబంధించి సంప్రదించాలి.

10) వెనుకబడిన తరగతులకు సంబంధించిన ఈ ఆర్టికల్ షెడ్యూల్డ్ కులాలకు కూడా వర్తించేక్లాజు (1) ఆర్టికల్ 340 అనుసరించి రాష్ట్రపతి ఆదేశించి కోరవచ్చు.

## ఆర్టికల్ 339: షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలన, షెడ్యూల్డు తెగల సంక్షేమంపై కేంద్ర నియంత్రణ

1) ఈ రాజ్యాంగం అమలులోనికి వచ్చిన 10 సంవత్సరముల తర్వాత ఎప్పుడైనా షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలన, షెడ్యూల్డు తెగల సంక్షేమం గురించి అధ్యయనం చేసేందుకై ఒక కమిషన్‌ను రాష్ట్రపతి నియమించవలెను. ఆ కమిషన్ నిర్మాణం, అధికారాలు, పని విధానం గమనించిన నిబంధనలను రాష్ట్రపతి రూపొందించవలసి ఉంటుంది.

2) ఒక రాష్ట్రంలోని షెడ్యూల్డు తెగల సంక్షేమానికి సంబంధించి పథకాల రూపకల్పన, వాటిని అమలు చేయటానికి సంబంధించి ఆ ఆరాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తగు ఆదేశములను జారీ చేయవచ్చు.

**వివరణ:** 1) రాజ్యాంగంలోని 1, 2, 3, 4, 370, 371 ఆర్టికల్స్ భారత భూ భాగానికి, రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించినవి. అనగా భూమికి సంబంధించినవి.

2) 12–19, 21, 21ఎ వరకున్న ఆర్టికల్స్ అందులో నివసించే ప్రజలకు సంబంధించినవి.

3) 14, 15(4), 16(4), 17, 21, 21ఎ, 46, 330, 332, 334, 335, 338, 338ఎ, 339, 340, 341, 342 ఆర్టికల్స్ దేశంలోని మెజారిటీ ప్రజలకు సంబంధించినవి.

## ఆర్టికల్ 340: వెనుకబడిన తరగతుల స్థితిగతులను విచారించే నిమిత్తం కమిషన్ నియామకం

1. భారతదేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారి స్థితిగతులను అధ్యయనం చేయడానికి వారికున్న ఇబ్బందులను, అనుభవిస్తున్న కష్టాలను తెలుసుకోవడానికి, విచారణ చేయడానికి, వారి అభివృద్ధికి కేంద్రం లేక రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను, చేపట్టాల్సిన కార్యక్రమాలను సూచించిన నిమిత్తం ఒక జాతీయ కమిషన్‌ను రాష్ట్రపతి నియమించవచ్చు.

   యూనియన్ మరియు రాష్ట్రాల చేపట్టవలసిన చర్యలను సూచించే నిమిత్తం మరియు యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల వారి పురోగతిని, అందించవలసిన గ్రాంట్లను, వాటి మంజూరుకు అవసరమయిన షరతులను సూచించే నిమిత్తం, రాష్ట్రపతి తనకు సమర్థులని నమ్మకం ఉన్న వ్యక్తులను కమిషన్‌గా నియమించాలి. ఆ నియామక ఉత్తర్వులో కమిషన్ అనుసరించవలసిన కార్యక్రమ నియమావళిని నిర్ణయించవచ్చు.

2. కమిషన్ తమకు అప్పగించిన విషయాలపై దర్యాప్తు జరిపి కనుగొనిన వాస్తవాలను, జస్టిఫికేషన్ చూపుతూ తాము ఉచితమని భావించిన సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్రపతికి సమర్పించాలి.

3. కమిషన్ సమర్పించిన రిపోర్టు నకలును కమిషన్ సూచించిన సిఫార్సులపై తీసుకొన్న చర్యల వివరణల మెమోరాండమ్‌తో సహా రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయ సభల ముందు ప్రవేశపెట్టే ఏర్పాట్లు చేయాలి.

**వివరణ:** ఆర్టికల్ 340 ద్వారా ఇతర వెనకబడిన తరగతుల (ఓబీసీ) స్థితిగతుల గురించి పరిశీలించే కమీషన్ ఏర్పరచబడింది. దీనిని అనుసరించి నెహ్రూ కాలంలో కాకా కాలేల్కర్ ఛైర్మన్‌గా బి.సి. కమిషన్ ఏర్పాటు చేయబడింది. అది సాదించింది ఏమీ లేదు. ఆ రిపోర్టును మూలకు పడేశారు. రిజర్వేషన్లు 1932 నుంచి పూనా ఒప్పందంతో రావలసినవి, కాకా కాలేల్కర్ కమిషన్‌తోనైనా అమలులోకి వస్తాయనుకున్నవి నెహ్రూ మంత్రి వర్గంచేత నిరాకరించబడ్డాయి. ఆ తర్వాత 25 ఏళ్ళకు మండల్ కమిషన్ ఏర్పాటు చేయబడింది. వెనుకబడిన వర్గాలు అంటే ఎవరో ఆర్టికల్ మరొకసారి నిర్వచించింది. సామాజికంగాను,

విద్యా విషయంగానూ వెనుకబడి ఉన్నవారు ఈ ఆర్టికల్ క్రింద వెనుకబడి వర్గాలవారవుతారు. పారిశ్రామిక వ్యవస్థ, ఆధునిక పరిపాలనా వ్యవస్థ, ఆధునిక విద్య, ఆవశ్యకతను అనివార్యం చేయడంతో వెనుకబాటు తనానికి నెట్టివేయబడిన పరిణామాలతో పాటు కులవ్యవస్థ విధించిన పరిమితులు, వివక్ష సామాజిక వెనుకబాటుతనం, విద్యా విషయంగా వెనుకబాటు తనం అనేవి అవిభాజ్యాలు. ఈ చరిత్రను అధ్యయనం చేయకపోతే ఎవరో తీసిన గోతిలో పడక తప్పదు.

వెనుకబడిన వర్గాల కమిషన్ కూడా 338వ అధికరణం క్రింద ఏర్పాటు కాబడే షెడ్యూల్డు కులాల, తెగల కమిషన్‌ను పోలి ఉంటుంది. ఇంద్ర సహాని పేరిట ప్రాచుర్యం పొందిన సుప్రీంకోర్టు ఇచ్చిన మండల్ తీర్పునకు ముందు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌లను అవసరమైనప్పుడు మాత్రమే నియమించేవారు. ఈ క్రమంలో మొదటి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (కాకా కాలేల్కర్ కమిషన్) 1953లో, మండల్ కమిషన్ రెండవ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ 1978లో ఏర్పడ్డాయి.

ఇంద్ర సహాని వర్సెస్ యూనియన్ పేరిట ప్రచారం జరిగిన మండల్ కమిషన్ సిఫారసులను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన కేసులపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది. ఆ తీర్పుతోపాటు కొన్ని మార్గదర్శకాలను ఆదేశించింది. అలా సుప్రీం కోర్టు ఇచ్చిన ఆ దేశాన్ని అనుసరించి భారత ప్రభుత్వం, శాశ్వత సంస్థగా కేంద్రంలో ఒక జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చట్టం 1993 చేసింది. ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ఈ కమిషన్‌లో ఒక అధ్యక్షుడు, ముగ్గురు సభ్యులు ఒక సభ్య కార్యదర్శి ఉంటారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి కమిషన్‌కు అధ్యక్షుడిగా ఉంటారు.

**కమిషన్ పదవీకాలం:**

1. ప్రతి సభ్యుడు మూడు సంవత్సరాలుపాటు కమిషన్ పదవిలో కొనసాగుతారు.
2. కమిషన్ ఛైర్‌పర్సన్ కానీ, సభ్యులు/సభ్యుడు. కానీ కేంద్ర ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా తమ రాజీనామాను సమర్పించవచ్చు.
3. కేంద్ర ప్రభుత్వం కమిషన్ సభ్యుని పదవి నుంచి తొలగించవచ్చు.

**కమిషన్ అధికారాలు**

1. వెనుకబడిన తరగతుల జాబితాలో తమ వర్గాన్ని, కులాన్ని చేర్చవల సిందిగా ఒక వర్గం, కులం చేసే విజ్ఞప్తిని కమిషన్ పరిశీలించి, తనకు ఉచితమని తోచిన విధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చు.
2. కమిషన్ చేసే సిఫారసులకు కేంద్ర ప్రభుత్వం సాధారణంగా కట్టుబడి ఉంటుంది.
3. కమిషన్ తన విధులను నిర్వహించే క్రమంలో సివిల్ కోర్టుకు గల అధికారా లను కలిగి ఉంటుంది.

   **వివరణ:** 2017లో బిజెపి ఎన్‌డిఏ ప్రభుత్వం నరేంద్రమోడి నాయకత్వంలో రాజ్యాంగ సవరణ బిల్లు 123 ద్వారా ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు గల పూర్తిస్థాయి కోర్టు అధికారాలు బీసీ కమిషన్ కూడా ఉండాలని పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టబడింది. లోక్‌సభ ఆమోదించిన తర్వాత రాజ్యసభలో చర్చిస్తూ కొన్ని సవరణలను సూచించడం జరిగింది. అలా ఆ ప్రక్రియ ఇంకా కొనసాగు తుంది.

   రాష్ట్రాల బీసీ కమిషన్‌లు చేసే సిఫారసులను కేంద్రానికి పంపిస్తే కేంద్రం ఆమోదించి తగు రాజ్యాంగ సవరణలు, చేర్పులు చేస్తూ వచ్చింది. ఇది 123వ రాజ్యాంగ సవరణలో రాష్ట్రాల బీసీ కమిషన్లు చేసే సిఫారసులను డైరెక్టుగా కేంద్రం పరిశీలించకుండా ముందుగా జాతీయ బీసీ కమిషన్ పరిశీలిస్తుందని పేర్కొనడం జరిగింది. దీనివల్ల జాప్యమే కాకుండా ఫెడరల్ సూత్రాలకు భిన్నంగా ఉందని, ఆయా రాష్ట్రాలు భావించాయి. దక్షిణాది రాష్ట్రాల బీసీ కమిషన్ ఛైర్మన్‌లతో బెంగుళూరులో సదస్సు నిర్వహించడం జరిగింది. తీర్మానాలను, సూచనలను కేంద్రానికి పంపించడం జరిగింది.
4. బీసీ, ఓబీసీ జాబితాలను సవరించే మార్పులు, చేర్పులు చేసే, రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్రాలకే ఉండాలని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా వాదించాయి. పార్లమెంటులో తమ వాణి వినిపించాయి. 123వ రాజ్యాంగ సవరణ బిల్లులో మార్పులు, చేర్పులు చేయడం ద్వారా ఆయా రాష్ట్రాలకే రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ఇస్తూ వాటిని

9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరడం జరుగుతున్నది. తమిళనాడులో 50 శాతం మించి మొత్తంగా 69 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయి. ఇవి కోర్టు పరిధిలోకి రాకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది. అలాగే ఆయా రాష్ట్రాలు పెంచే రిజర్వేషన్లను కోర్టు పరిధిలోకి రాకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఇతర ఆర్టికల్స్‌లో చేర్చాలని కోరడం జరుగుతున్నది.

**కమిషన్ విధులు**

ఏదైనా కులం, సామాజికవర్గం, తమను కేంద్ర ప్రభుత్వ వెనుకబడిన జాబితాలో చేర్చాలని వచ్చే విజ్ఞప్తులను కమిషన్ పరిశీలిస్తుంది. ఎప్పటికప్పుడు బీసీ జాబితాలో మార్పులు, చేర్పులు చేయడానికి సంబంధించిన సూచనలను, ఫిర్యాదులను విచారిస్తుంది. పరిశీలిస్తుంది. చట్టంలోని సెక్షన్ 9(2) ప్రకారం కమిషన్ ఇచ్చిన సలహాకు సాధారణగా కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. ఈ చట్టంలోని సెక్షన్ 11(1) ప్రకారం, కేంద్ర ప్రభుత్వం, ఏ సమయంలో అయినా చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి పది సంవత్సరాలు ముగిసినప్పుడు, ఆ తర్వాత వచ్చే ప్రతి పది సంవత్సరాలకు జాబితాల సవరణను చేపడుతుంది.

**జాతీయ మహిళా కమిషన్**

భారత రాజ్యాంగం మహిళలకు ప్రసాదించిన రాజ్యాంగ పరమైన రక్షణలను, న్యాయబద్ధమైన రక్షణలనూ సమీక్షించడానికి జాతీయ మహిళా చట్టం 1990 కింద 'జాతీయ మహిళా కమిషన్'ను శాసనపరమైన వ్యవస్థగా 1992 జనవరిలో ఏర్పాటు చేయడమైంది. కమిషన్ విధులు:

1. రాజ్యాంగంలో మహిళల సంక్షేమం, అభివృద్ధికిగాను ఉన్న నిబంధనల అమలును పర్యవేక్షించటం.
2. సదరు నిబంధనల అమలు తీరు గురించి వార్షికంగా గానీ, కమిషన్ ఉచితమని భావించిన సదుపాయాలలో గానీ కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించటం.
3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికోసం పాటుపడే విధంగా వారికి సంబంధించిన రాజ్యాంగ రక్షణలు సమర్ధవంతంగా అమలయ్యే విధంగా సూచనలు, సలహాలు ఇవ్వడం.

4. కాలానికి, అవసరానికి తగ్గట్టుగా ఎప్పటికప్పుడు మహిళలకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను మూల్యాంకనం చేసి తగిన సిఫారసులను అందచేయడం.
5. మహిళలకు సంబందించిన ఉల్లంఘనకు సంబంధిత అధికార యంత్రాం గానికి అందచేసి సాధ్యమైనంత తొందరగా అది పరిష్కరించ బడేటట్లు చూడటం.
6. కింది అంశాలకు సంబంధించి తనకు తానుగా కేసులను స్వీకరించి పరిష్కరించవచ్చు.
   ఎ. మహిలల హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు
   బి. మహిళల సమానత్వ, అభివృద్ధికి సంబంధించిన చట్టాలు అమలుకాని సందర్భాలలో
   సి) మహిళల సమస్యలను పరిష్కరించే ప్రయత్నంతో
7. మహిళలపట్ల జరుగుతున్న అత్యాచారాలు, వివక్షత పై అధ్యయనాలు జరిగేందుకుగాను కృషి చేయడం.
8. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మహిళాభివృద్ధిని ప్రగతిని ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేయడం.

**జాతీయ మానవ హక్కుల కమిషన్**

జాతీయ మానవ హక్కుల కమిషన్ 12 అక్టోబర్ 1993లో ఏర్పాటు చేయ బడింది. దీనికి సంబంధించిన ఆర్డినెన్స్ 28 సెప్టెంబర్ 1993లో వెలువడింది. ఇది అటానమస్, చట్టబద్ధమైన సంస్థ. మానవ హక్కుల రక్షణ కోసం, ప్రమోషన్ కోసం, స్వేచ్ఛా, సమానత్వం, ఆత్మగౌరవం గురించి రాజ్యాంగం గ్యారంటీ ఇచ్చిన అంశాలను పర్యవేక్షించడానికి, పౌరులకు మానవ హక్కులను కాపాడడానికి ఈ కమిషన్ కృషి చేస్తుంది. ఫెడరల్ లా ఎన్‌ఫోర్‌మెంట్ దీని స్వభావం. దీనికి రిటైర్డ్ జడ్జి ఛైర్మన్‌గా మరియు సభ్యులు ఉంటారు.

**సమాచార హక్కు కమిషన్:**

పార్లమెంట్ చట్టంద్వారా సమాచార హక్కు కమిషన్ ఏర్పడింది. 15 జూన్ 2005 నుండి సమాచారహక్కు కమిషన్ చట్టం అమలులోకి వచ్చింది. సమాచారాన్ని పొందే స్వేచ్ఛ చట్టం అనే 2002 చట్టం స్థానంలో ఈ చట్టం రూపొందించబడింది. చట్టం నెం. 22 ఆఫ్ 2005. 12 అక్టోబర్ 2005 నుండి ఈ కమిషన్ పని ప్రారంభించింది.

**వినియోగదారుల ఫోరం:**

ఈ చట్టం 1986లో పార్లమెంటు ద్వారా రూపొందించబడింది. 24 డిసెంబర్ 1986 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం కన్స్యూమర్స్ చట్టం 86గా పిలువబడుతుంది.

**వివరణ:** భారత రాజ్యాంగంలో రూపొందించిన సంక్షేమ రాజ్య పథకాలను రాజ్యాంగ ప్రవేశికలో ప్రతిబింబించడం జరిగింది. రాజ్యాంగ నిబంధనలు పద బాహుళ్యాన్ని పొంది, సామాన్య ప్రజల సంక్షేమానికి ఆదర్శంగా నిలిచింది. పరులందరికీ ముఖ్యంగా వెనుకబడిన, అల్పసంఖ్యాక వర్గాలకు ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించడంలో నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తుంది. రాజ్యాంగ ప్రస్తావన రాజ్యాంగ నిర్మాతలు. విభిన్న దేశాల రాజ్యాంగ నిబంధనలను క్రోడీకరించి బడుగు వర్గాల అభ్యున్నతికి, పటిష్టవంతమైన పరిపాలనకు ప్రజాస్వామ్య పరిరక్షణకు షెడ్యూల్డ్ కులాలు, తెగలు, అల్పసంఖ్యాక వర్గాలు, బలహీన వర్గాలు, మహిళలకోసం ప్రత్యేక కమీషన్లు ఏర్పాటు చేసి సామ్యవాద లౌకికవాద వాదాల రూపకల్పనకు ఆదర్శంగా నిలిచింది.

## ఆర్టికల్ 341: షెడ్యూల్డు కులాలు

1) ఒక రాష్ట్రం లేక కేంద్ర పాలిత ప్రాంతంలోగల ఎటువంటి కులాలు, తెగలు, జాతులు, ఆయా కులాలు, జాతులు, తెగలలోగల గ్రూపులు ఈ రాజ్యాంగం పరిధిలో ఆ ఆరాష్ట్రానికి సంబంధించి షెడ్యూల్డు కులాలుగా పరిగణింపబడతాయో రాష్ట్రపతి నిర్ధారించి అధికారికంగా నోటిఫై చేస్తారు (అయితే రాష్ట్రాల పరిధిలోని తెగలు, కులాలు, జాతుల విషయంలో ముందుగా ఆ రాష్ట్ర గవర్నరును సంప్రదించాలె).

2) క్లాజు (1) క్రింద జారీ చేయబడిన నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన షెడ్యూల్డు కులాల జాబితాలో అదనంగా ఏవైనా కులాలను, తెగలను లేక జాతులను పార్లమెంటు శాసనం ద్వారా చేర్చవచ్చు. అదేవిధంగా ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన జాబితా నుండి ఏవైనా కులాలను, తెగలను లేక జాతులను తొలగించవచ్చు. అంతే తప్ప, ఒకసారి క్లాజు(1) క్రింద నోటిఫికేషన్ జారీ చేయబడిన తర్వాత ఆ నోటిఫికేషన్‌కు భిన్నంగా మరొక నోటిఫికేషన్‌ను జారీ చేయరాదు.

## ఆర్టికల్ 342: షెడ్యూల్డు తెగలు

1) ఒక రాష్ట్రం లేక కేంద్రపాలిత ప్రాంతంలోగల ఎటువంటి తెగలు లేక కమ్యూనిటీలు లేక వాటిలోని ఉపతెగలు లేక శాఖలు ఈ రాజ్యాంగ పరిధిలో ఆ రాష్ట్రానికి లేక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి షెడ్యూల్డు తెగలుగా పరిగణింప బడతాయో రాష్ట్రపతి నిర్ధారించి అధికారికంగా నోటిఫై చేస్తారు. (అయితే, రాష్ట్రముల పరిధిలోని తెగల విషయంలో ముందుగా రాష్ట్ర గవర్నరును సంప్రదించవలెను).

2) క్లాజు (1) క్రింద జారీ చేయబడిన నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన షెడ్యూల్డు తెగల జాబితా నుండి అదనంగా ఏవైనా తెగలను లేక తెగలలోని శాఖలను పార్లమెంటు శాసనం ద్వారా చేర్చవచ్చు. అదేవిధంగా ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన జాబితాలోని ఏదైనా తెగను లేక తెగలలోని శాఖలను తొలగిస్తూ పార్లమెంటు శాసనం చేయవచ్చు. అంతే తప్ప, ఒకసారి క్లాజు (1) క్రింద నోటిఫికేషన్ జారీ చేయబడిన తర్వాత ఆ నోటిఫికేషన్‌కు భిన్నముగా మరొక నోటిఫికేషన్‌ను జారీ చేయరాదు.

**వివరణ:** ఆర్టికల్ 341, 342ల ప్రకారం చూసినప్పుడు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ నోటిఫికేషన్లు కేంద్ర ప్రభుత్వం చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాలకు ఎలాంటి అధికారాలు లేవు. ఎస్సీ, ఎస్టీల నోటిఫికేషన్ పరిధి ఆయా రాష్ట్రాలకు పరిమితం కావచ్చు. కొన్ని రాష్ట్రాలకు కలిపి చేయవచ్చు. ఒక రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మరో రాష్ట్రంలో లభించకపోవచ్చు.

## ఆర్టికల్ 342ఎ: వెనుకబడిన తరగతులు

### పరిచయం:

338బి ఆర్టికల్ సందర్భంగా పేర్కొన్న 102వ రాజ్యాంగ సవరణలో భాగంగా 342 ఆర్టికల్‌లో 342ఎ ఆర్టికల్‌ను చేర్చుడం జరిగింది.

1) ఒక రాష్ట్రం లేక కేంద్రపాలిత ప్రాంతంలోగల వెనుకబడిన తరగతులు లేక కమ్యూనిటీలు లేక వాటిలోని ఉపతెగలు లేక శాఖలు ఈ రాజ్యాంగ పరిధిలో ఆ రాష్ట్రానికి లేక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి వెనుకబడిన తరగతులుగా పరిగణింప బడతాయో రాష్ట్రపతి నిర్ధారించి అధికారికంగా నోటిఫై చేస్తారు. (అయితే, రాష్ట్రముల పరిధిలోని తెగల విషయంలో ముందుగా రాష్ట్ర గవర్నరును సంప్రదించ వలెను).

2) క్లాజు (1) క్రింద జారీ చేయబడిన నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన వెనుకబడిన తరగతుల జాబితా నుండి అదనంగా ఏవైనా వెనుకబడిన కులాలను లేక కులాలలోని శాఖలను పార్లమెంటు శాసనం ద్వారా చేర్చవచ్చు. అదేవిధంగా ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన జాబితాలోని ఏదైనా కులాన్ని లేక కులాలలోని శాఖలను తొలగిస్తూ పార్లమెంటు శాసనం చేయవచ్చు. అంతే తప్ప, ఒకసారి క్లాజు (1) క్రింద నోటిఫికేషన్ జారీ చేయబడిన తర్వాత ఆ నోటిఫికేషన్‌కు భిన్నంగా మరొక నోటిఫికేషన్‌ను జారీ చేయరాదు.

**వివరణ:** ఆర్టికల్ 341, 342ల ప్రకారం చూసినప్పుడు ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ నోటిఫికేషన్లు కేంద్ర ప్రభుత్వం చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాలకు ఎలాంటి అధికారాలు లేవు. ఎస్సీ, ఎస్టీల నోటిఫికేషన్ పరిధి ఆయా రాష్ట్రాలకు పరిమితం కావచ్చు. కొన్ని రాష్ట్రాలకు కలిపి చేయవచ్చు. ఒక రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మరో రాష్ట్రంలో లభించకపోవచ్చు.

"342 ఎ.(1) రాష్ట్రపతి ఏ రాష్ట్రానికి, కేంద్ర పాలిత ప్రాంతానికి సంబంధించి అయినా సరే, ఒకవేళ అది రాష్ట్రం అయినట్లయితే అక్కడి గవర్నర్‌ను సంప్రదించి, రాజ్యాంగ ఉద్దేశాల కోసం ఆ రాష్ట్రంలో లేదా కేంద్ర పాలిత ప్రాంతంలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులు ఏవి అవుతాయో బహిరంగ నోటిఫికేషన్ ద్వారా ప్రకటిస్తారు.

**రాజ్యాంగంలోని 330 నుండి 342 వరకు గల ఆర్టికల్స్ పూర్తిగా ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు ప్రత్యేక సదుపాయాల ఏర్పాటుకు సంబంధించినవి. ఈ ఆర్టికల్స్ ప్రాతిపదికగా వీరికి విద్య,ఉద్యోగ తదితర రంగాల్లో రిజర్వేషన్లు కల్పించబడుతున్నాయి. ఆర్టికల్ 330 నుండి 342ఎ వరకు గల ఆర్టికల్స్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16 ఆర్టికల్స్ యొక్క విస్తరణ వంటివే. వీటి ప్రాధాన్యతను అనుసరించి వీటిని ప్రత్యేక ఆర్టికల్స్‌గా వివరించబడ్డాయి.**

**(నరేంద్ర పన్నీరు సౌజన్యంతో ముద్రణ)**